
# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 174 | హైదరాబాద్ | మంగళవారం 30-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00




భారత శక్తి

# మొన్న డీకే, నిన్న శశి, ఇవాళ డిగ్గీ

భారత జాతీయ కాంగ్రెస్ ప్రస్తుతం ఒక విచిత్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బయటి శత్రువుల కంటే, పార్టీ అంతర్గత నేతల వైఖరే అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. రెస్సెస్, బీజేపీలపై ప్రశంసలు గుప్పించే కాంగ్రెస్ నేతలు రోజురోజుకూ పెరిగిపోతుండటం హస్తం పార్టీ హైకమాండ్‌కు కొత్త తలనొప్పిగా మారింది. కొన్ని రోజుల క్రితం ఆరెస్సెస్‌పై డీకే శివకుమార్ ప్రశంసలు చేయగా.. గత కొంతకాలంగా శశిథరూర్ కూడా బీజేపీని పొగుడుతున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆరెస్సెస్‌ను పొగుడుతూ దిగ్విజయ్ సింగ్ పెట్టిన పోస్ట్ పెను సంచలనంగా మారింది. దీంతో కాంగ్రెస్, బీజేపీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది.కాంగ్రెస్ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ఈ వాదనకు బలం చేకూరుస్తున్నాయి. కరుడుగట్టిన ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేకిగా ముద్రపడిన దిగ్విజయ్ సింగ్, హఠాత్తుగా ఆ సంస్థ పనితీరును ఉదాహరణగా చూపడం రాజకీయ వర్గాల్లోనే కాక, సొంత పార్టీలోనూ పెను దుమారం రేపుతోంది.ఉపాధి హామీ పథకం పేరు మార్పు అంశంపై కేంద్రంపై పోరుకు సిద్ధమవుతూ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం కానున్న తరుణంలో దిగ్విజయ్ సింగ్ సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ పార్టీని ఇరకాటంలో నెట్టింది. "ఆర్‌ఎస్‌ఎస్‌లో నాయకుల పాదాల వద్ద కూర్చున్న ఓ సామాన్య కార్యకర్త.. రాష్ట్రానికి సీఎంగా, దేశానికి ప్రధానిగా ఎలా ఎదిగారో చూడండి. ఇది ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలకు ఉన్న సంస్థాగతమైన శక్తి" అంటూ ప్రధాని మోదీ ఫోటోను జత చేస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు పరోక్ష ప్రశంసల్లా ధ్వనించాయి. నిజానికి దిగ్విజయ్ ఉద్దేశం.. కాంగ్రెస్ పార్టీ కూడా సంస్థాగతంగా అంత బలంగా తయారుకావాలని చెప్పడమే కావచ్చు. ఆ తర్వాత ఆయన.. "నేను ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలకు బద్ధ వ్యతిరేకిని" అని వివరణ ఇచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన సమయంలో, వారి సంస్థాగత నిర్మాణాన్ని కీర్తించడం ద్వారా కార్యకర్తల్లో గందరగోళం సృష్టించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.కాంగ్రెస్ పార్టీలో ఇలాంటి పరిణామాలు కొత్తేమీ కాదు. ఇటీవల కాలంలో పలువురు సీనియర్ నేతలు బీజేపీకి, ఆరెస్సెస్‌కు సానుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కేరళకు చెందిన సీనియర్ నేత శశిథరూర్ వ్యవహారశైలిపై పార్టీలో ఎప్పటినుంచో అసంతృప్తి ఉంది. ఆయన తరచుగా ప్రధాని మోదీని ప్రశంసించడం, లేదా బీజేపీ విధానాలపై మృదు వైఖరి అవలంబించడం చర్చనీయాంశమైంది. తిరువనంతపురంలో బీజేపీ ఓటు బ్యాంకు పెరగడానికి, లేదా అక్కడ ఆ పార్టీ బలపడడానికి థరూర్ వైఖరే కారణమనే అనుమానాలు సొంత పార్టీ నేతల్లోనే ఉన్నాయి. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వంటి మాస్ లీడర్ ఏకంగా అసెంబ్లీ వేదికగా ఆర్‌ఎస్‌ఎస్ గీతాన్ని ఆలపించడం ఆ మధ్య పెద్ద వివాదానికే దారితీసింది. ఇది లౌకికవాద పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ సిద్ధాంతాలకు పూర్తిగా విరుద్ధమనే విమర్శలు వచ్చాయి.కాంగ్రెస్ సీనియర్ నేతల ఈ ప్రవర్తన వెనుక అనేక కారణాలు కనిపిస్తున్నాయి. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న నేతలు, బీజేపీ క్షేత్రస్థాయి నెట్‌వర్క్‌ను చూసి, తమ పార్టీలోని సంస్థాగత లోపాలపై అసహనంతో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా అనే కోణం ఉంది. దిగ్విజయ్ వ్యాఖ్యల్లో ప్రశంస కంటే, కాంగ్రెస్ నాయకత్వానికి మేల్కొనండి అని చెప్పే హెచ్చరిక కూడా ఉండవచ్చు. రాహుల్ గాంధీ ఒకవైపు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతుంటే, సీనియర్ నేతలు మాత్రం దానికి భిన్నంగా వ్యవహరించడం.. పార్టీలో కమాండ్ అండ్ కంట్రోల్ లోపించిందన్న సంకేతాలను ఇస్తోంది. ఇప్పటికే అనేకమంది కాంగ్రెస్ నేతలు బీజేపీ గూటికి చేరారు. ఇప్పుడు పార్టీలో ఉంటూనే ఇలా వ్యాఖ్యలు చేస్తున్నవారు కూడా భవిష్యత్తులో గోడ దూకే అవకాశం ఉందన్న అనుమానాలు కేడర్‌ను వెంటాడుతున్నాయి.దిగ్విజయ్ సింగ్ ఉద్దేశం ఏదైనప్పటికీ, టైమింగ్ మాత్రం పూర్తిగా బెడిసికొట్టింది. యుద్ధం జరుగుతున్నప్పుడు శత్రువు కత్తి పదునును పొగడడం సొంత సైన్యం మనోధైర్యాన్ని దెబ్బతీయడమే అవుతుంది. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరుగుతున్న సమయంలోనే దిగ్విజయ్ సింగ్ చేసిన ఈ పోస్ట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 1990వ దశకంలో గుజరాత్ మాజీ సీఎం శంకర్‌సింగ్ వాఘేలా ప్రమాణ స్వీకార వేడుకలో తీసిన ఒక బ్లాక్ అండ్ వైట్ ఫోటోను తాజాగా దిగ్విజయ్ సింగ్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. ఆ ఫోటోలో యువకుడిగా ఉన్న నరేంద్ర మోదీ , సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ.. పాదాల దగ్గర కింద నేలపై కూర్చుని ఉన్నారు.ఈ ఫోటోను షేర్ చేసిన దిగ్విజయ్ సింగ్.. "ఈ ఫోటో చాలా ప్రభావవంతంగా ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ స్థాయి కార్యకర్త, జనసంఘ్, బీజేపీ వర్కర్ ఎలా ఎదిగారో ఇది చూపిస్తుంది. పార్టీ అగ్రనాయకుల పాదాల దగ్గర నేలపై కూర్చున్న ఒక సామాన్య కార్యకర్త.. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా.. ఆ తర్వాత దేశ ప్రధానమంత్రిగా ఎదగడం అనేది ఆ సంస్థ శక్తికి నిదర్శనం. జై సియా రామ్" అని తన పోస్ట్‌ను ముగించారు.బీజేపీని సిద్ధాంతపరంగా ఎదుర్కోవాల్సిన సమయంలో, కాంగ్రెస్ సీనియర్లే ఆ పార్టీ సంస్థాగత బలాన్ని కీర్తించడం, పరోక్షంగా బీజేపీ నరేటివ్‌కే మేలు చేస్తోంది. ఈ అంతర్గత గందరగోళాన్ని చక్కదిద్దకపోతే, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ఇది మరింత పెద్ద రాజకీయ సవాలుగా మారే ప్రమాదం ఉంది

# బాలారిష్టాలు దాటని పథకాలు

ఏలూరు, డిసెంబర్ 29

ఏపీలో ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు ఇచ్చే హామీలు పాలనలో పెద్ద సవాలుగా మారతాయన్నది తెలిసిందే. అలాంటి హామీల్లో భాగంగా ప్రవేశపెట్టిన ముఖ్యమైన పథకమే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో ఇది ఒకటి. ఈ పథకాన్ని ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి అమల్లోకి తీసుకువచ్చారు. ఇప్పటికే నాలుగు నెలలకుపైగా ఈ పథకం కొనసాగుతోంది. అయితే ప్రయోజనాలతో పాటు ఆర్థిక భారం కూడా ప్రభుత్వం ఎదుర్కొంటోంది.రాష్ట్రవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ పరిధిలో పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ మెట్రో ఎక్స్‌ప్రెస్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. దీంతో గ్రామాల నుంచి పట్టణాల వరకు మహిళలు ఎలాంటి టికెట్ ఖర్చు లేకుండా బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. అయితే ఈ పథకం కొనసాగాలంటే ఏటా సుమారు రెండు వేల కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది.ఇప్పటికే ప్రభుత్వం రెండు విడతలుగా నిధులు విడుదల చేసింది. మొదట నాలుగు వందల కోట్ల రూపాయలు మంజూరు చేయగా, తాజాగా మరో ఎనిమిది వందల కోట్ల రూపాయలను రిలీజ్ చేసింది. మొత్తం కలిపి ఇప్పటివరకు దాదాపు 1200 కోట్ల రూపాయలు ఈ పథకానికి కేటాయించారు. ఈ నిధులు రావడంతో ఆర్టీసీకి ఊరట లభించింది. ఉద్యోగుల జీతాలు, డీజిల్ ఖర్చులు, ఇతర నిర్వహణ వ్యయాలను భరించేందుకు ఈ డబ్బు ఉపయోగపడుతోంది.ఈ పథకం రీయింబర్స్‌మెంట్ విధానంలో అమలవుతోంది. మహిళా ప్రయాణికులకు జీరో టికెట్ ఇస్తూ, వారి ప్రయాణ వివరాలను డేటాగా నమోదు చేస్తున్నారు. నెలకు ఎంత మంది మహిళలు ప్రయాణించారు, ఎంత ఖర్చు అయింది అనే వివరాలు ప్రభుత్వానికి చేరుతున్నాయి. సగటున నెలకు దాదాపు రెండు వందల కోట్ల రూపాయల మేర ఈ ఉచిత ప్రయాణాల ఖర్చు ఉంటుందని అంచనా. ఆ మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి తిరిగి చెల్లిస్తోందిఅయితే అమలులోకి వచ్చాక ఈ పథకంపై మిశ్రమ స్పందన వినిపిస్తోంది. మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నప్పటికీ, సౌకర్యాల విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చాలా చోట్ల బస్సులు ఆగడం లేదని, ఆగినా కొందరు కండక్టర్లు విసుగ్గా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. మరోవైపు రద్దీ పెరగడంతో పురుషులకు సీట్లు దొరకడం కష్టమవుతోంది. దీంతో ఉద్యోగులకు, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొత్తంగా చూస్తే ఈ పథకం ఇంకా బాలారిష్టాలు దాటలేదని పరిశీలకులు అంటున్నారు. రద్దీ ఉన్న మార్గాల్లో అదనపు బస్సులు నడపడం, ప్రతి బస్ స్టాప్‌లో కచ్చితంగా బస్సులు ఆగేలా చూడడం, సిబ్బందికి సరైన అవగాహన కల్పించడం జరిగితే మహిళలకు ఉచిత బస్సు పథకం నిజమైన ప్రయోజనం అందిస్తుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ఏడాదికి ఏడు రోజేలే..
# స్వ చ్ఛ టాయ్ లెట్స్..

నెల్లూరు, డిసెంబర్ 29

: స్వచ్ఛ భారత్ మిషన్ కింద నెల్లూరులో రూ. 5.56 కోట్లతో కట్టిన 57 మరుగుదొడ్లు ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. జనసంచారం ఎక్కువగా ఉండే చోట్ల నిర్మించిన ఈ స్వచ్ఛ్ టాయిలెట్లకు తాళాలు వేయడంతో ఇవి నిరుపయోగంగా మారాయి. ఇవి అందుబాటులో లేకపోవడంతో.. ప్రజలు డబ్బులు పెట్టి సులభ్ కాంప్లెక్స్‌లను ఆశ్రయించాల్సి వస్తోంది. బారాషహీద్ దర్గా రొట్టెల పండగప్పుడు మాత్రమే తెరిచే మరుగుదొడ్లు, మిగతా సమయాల్లో మూతపడుతున్నాయి.కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం.. నగరాలు, పట్టణాలను, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం మాత్రమే కాకుండా బహిరంగ మలవిసర్జన రహితంగా మార్చడం కోసం స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించింది. దీనిలో భాగంగా జనాభా అధికంగా ఉండే పలు నగరాలు, పట్టణాల్లో ప్రజా వినియోగం కోసం మరుగుదొడ్లు నిర్మించింది. అయితే ఆయా నగర పాలక సంస్థల అధికారుల నిర్లక్ష్యం వల్ల అవి నిరుపయోగంగా మిగులుతున్నాయి. ఫలితంగా కోట్ల రూపాయలు వ్యర్థం అవుతున్నాయి.ఈక్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు పట్టణంలో 2021 సంవత్సరంలో రూ. 5.56 కోట్లు ఖర్చు పెట్టి 57 ప్రాంతాల్లో స్వచ్ఛ మరుగుదొడ్లను నిర్మించారు. కానీ పర్యవేక్షణ లోపం వల్ల అవి నిరుపయోగంగా మారాయి. నెల్లూరు పట్టణ జనాభా సుమారు 10 లక్షలకు చేరింది. ఇది జిల్లా కేంద్రం కావడంతో.. నిత్యం వేర్వేరు మండలాలు, ఇతర ప్రాంతాల నుంచి సుమారు 2 లక్షల మంది వరకు వస్తుంటారు. ఇలా వచ్చే వారి అవసరాలను తీర్చడంతో పాటు.. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి మరుగుదొడ్లు నిర్మించారు.అయితే వీటిని వినియోగించుకునేందుకు వీలు లేకుండా.. ఈ మరుగుదొడ్లకు తాళాలు వేశారు. మరీ ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్, పొగతోట, మూలాపేట గేటు, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట, కొండాయపాళెం గేటుతదితర ప్రాంతాల్లో జన సంచారం ఎక్కువ. అయితే ఈ ప్రాంతంలో నిర్మించిన మరుగు దొడ్లకు తాళం వేశారు. దీంతో చాలా చోట్ల బహిరంగ మల, మూత్ర విసర్జన కొనసాగుతూ.. స్వచ్ఛత అటకెక్కుతోంది.అయితే ములమూడి బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, ఆర్‌ఆర్ వీధి, ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్వంటి ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు బస్సుల కోసం ఎదురు చూస్తుంటారు. అయితే ఈ ప్రాంతాల్లో కూడా నగరపాలక సంస్థకు చెందిన మరుగుదొడ్లకు తాళాలు వేయడంతో.. ప్రజలు.. ఇక్కడి సులభ్ కాంప్లెక్స్‌ల్లో డబ్బు చెల్లించి కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి.ఇదిలా ఉంటే బట్వాడిపాళెం కూడలిలో ఉన్న మరుగుదొడ్డిని.. కేవలం బారాషహీద్ దర్గా రొట్టెల పండగ సందర్భంగా మాత్రమే.. ప్రతి సంవత్సరం 7 రోజులే తెరుస్తారు. ఆ పండగ అయిపోగానే మళ్లీ తాళం వేస్తారు. వీటిని మళ్లీ తిరిగి తెరిచేది ఏడాది తర్వాతే. దీనిపై అధికారులు స్పందిస్తూ చర్యలు తీసుకుంటామని తెలిపారు

## ఆస్కింగ్ వర్సెస్ సేయింగ్....


అనంతపురం, డిసెంబర్ 29

జస్ట్ ఆస్కింగ్ పేరుతో సోషల్ మీడియాలో బీజేపీని వ్యతిరేకించే నటుడు ప్రకాష్ రాజ్ కు, బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ అయిన విష్ణువర్ధన్ రెడ్డికి మధ్య సోషల్ మీడియాలో వార్ జరుగుతోంది. విశాఖపట్నంలో కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమంలో మాట్లాడిన ప్రకాష్ రాజ్.. మావోయిస్టుల్ని ఎందుకు కాల్చి చంపుతున్నారని.. వారిని జన జీవన స్రవంతిలోకి వచ్చేలా చూడాలన్నారు. అదే సమయంలో ఆరెస్సెస్ లో మహిళలకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వరని ప్రశ్నించారు. ఈ విమర్శలపై బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి స్పందించారు. అయితే ఆయన స్పందనపైనా ప్రకాష్ రాజ్.. వెంటనే రియక్ట్ అయ్యారు కాలిందా అంటూ స్పందించారు. దీనికి విష్ణువర్ధన్ రెడ్డి ఘాటుగా రిప్లయ్ ఇచ్చారు. కాలిన వాసన ఎక్కడ వస్తుందో మీ మాటల ద్వారానే తెలిసిపోతోందని నిజం చెప్పులేసుకునేలోపు అబద్దం ప్రపంచం అంతా చుట్టి వస్తుందన్నట్లుగా ఉద్దేశపూర్వకంగా చేసే తప్పుడు ప్రచారాలకు వెంటనే కౌంటర్ ఇవ్వకపోతే మీలాంటి వాళ్లు చేసే తప్పుడు ప్రచారాలు వేగంగా ప్రజల్లోకి వెళ్తాయన్నారుమావోయిస్టులు ఎంతో మంది అమాయకుల్ని చంపారు. అందులో ఎక్కువ మంది గిరిజనులు ఉన్నారు. పోలీసులు ఉన్నారు. రాజకీయ నేతలు ఉన్నారు. ఏ కారణంతో చంపినా? అసలు అలా చంపే హక్కు ఉందని ఎప్పుడైనా ప్రశ్నించారా .. అడవిలో తమ పట్టు సడలిపోతుందని అడవి బిడ్డల్ని ఇన్ఫార్మర్ల పేరుతో ఇష్టారీతిన చంపినప్పుడు మాట్లాడారా.. అని ప్రశ్నించారు. మావోయిస్టులు లొంగిపోవడానికి అన్ని అవకాశాలు కల్పించారని.. లొంగిపోయిన వాళ్లు వేల మంది ఉన్నారని.. విష్ణువర్ధన్ రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో పండిపోయిన నేతలు కూడా ఆరెస్సెస్ ఎంత గొప్పదో చెబుతున్నారని ఇప్పుడు ఆరెస్సెస్ గురించి ఎందుకు వ్యతిరేకతంగా మాట్లాడతారని ప్రశ్నించారు.

# గుంటూరుకు మహర్దశ

గుంటూరు, డిసెంబర్ 29,

గుంటూరు త్వరలో మిలియన్ ప్లస్ సిటీగా మారనుంది. 18 గ్రామాలను జీఎంసీలో విలీనం చేసేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. దీంతో గుంటూరు జనాభా ;పది లక్షలకు పైగా చేరనుంది. మిలియన్ ప్లస్ సిటీగా మారితే.. కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక పథకాలు, భారీ నిధులతో గుంటూరుకు మహర్దశం పట్టనుంది. రాజధాని అమరావతికి దగ్గర ఉండటం




కూడా కలిసి వచ్చే అంశం. అయితే, ఈ విలీనంపై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు.గుంటూరు నగరాన్ని మిలియన్ ప్లస్ సిటీగా మార్చేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో మిలియన్ ప్లస్ నగరాలుగా విశాఖపట్నం, విజయవాడ మాత్రమే ఉండగా, ఇప్పుడీ జాబితాలోకి గుంటూరు కూడా చేరనుంది. 18 గ్రామాలను గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ (జీఎంసీ)లో విలీనం చేసేందుకుగాను, కౌన్సిల్ తాజాగా ఆమోదం తెలిపింది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, గుంటూరు నగరం 10 లక్షల జనాభాను దాటి మిలియన్ ప్లస్ సిటీగా అవతరిస్తుంది. మిలియన్ ప్లస్ సిటీగా మారడం వల్ల, కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రత్యేక పథకాలు, భారీ ఎత్తున నిధులు గుంటూరుకు లభించనున్నాయి. పది లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలను మిలియన్ ప్లస్ సిటీలుగా పరిగణిస్తారు. 2011 లెక్కల ప్రకారం గుంటూరు జనాభా 7.43 లక్షలు. ప్రస్తుతం ఇది 9.40 లక్షలకు చేరుకుందని అంచనా. అయితే దీనిలో విలీనం చేయనున్న 18 గ్రామాల్లో సుమారు 65 వేల మంది జనాభా ఉంది. వీరందరినీ కలిపితే గుంటూరు జనాభా పది లక్షలు దాటుతుంది. ఈక్రమంలోనే కౌన్సిల్ 18 గ్రామాలను జీఎంసీలో విలీనం చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది.అయితే, కొందరు సభ్యులు ఈ విలీన ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల విలీనం వల్ల నిర్వహణపరమైన సమస్యలు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అధికారులు, సిబ్బంది కొరత ఉందని, జీఎంసీపై భారం పెరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి మరో మూడు రోజులే గడువు ఉంది.పైగా ఈ విలీన ప్రక్రియ ఆఖరి క్షణాల్లో హడావుడిగా జరుగుతోందని విమర్శలు వస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు సంవత్సరం పొడవునా ఈ అంశాన్ని పట్టించుకోకుండా, చివరి నిమిషంలో గ్రామాల విలీనంపై దృష్టి సారించడంపై విమర్శలున్నాయి. జీఎంసీ అధికారులు మూడు నెలల క్రితమే డీపీవోకు లేఖ రాసి, డిసెంబర్ 31 తుది గడువు అని చెప్పినా, ఈ నెల మొదట్లో ప్రత్యుత్తరం రావడంతోనే చర్చ మొదలైంది.జొన్నలగడ్డ, గొర్లవారిపాలెం, తోకవారిపాలెం, దాసుపాలెం, మల్లవరం, చినపలకలూరు, తురకపాలెం, చల్లావారిపాలెం, వెంగళాయపాలెం, ఓబులనాయుడుపాలెం, లాల్‌పురం గ్రామాల్లో గ్రామసభలు తీర్మానాలు చేశాయి. లామ్, కొర్నిపాడు, పుల్లడిగుంట, తక్కెళ్లపాడు, అగతవరప్పాడు, వెనిగండ్ల, పెదకాకాని గ్రామాల్లో ఎమ్మెల్యేల ఆమోదం, పంచాయతీల తీర్మానం జరగాల్సి ఉంది.

విలీనం వల్ల ప్రయోజనాలు:

కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు, ప్రత్యేక పథకాలు, నిధులు లభించనున్నాయి.

భవిష్యత్తులో స్మార్ట్‌సిటీ నగరాల జాబితాలో చేరే అవకాశం ఉంది.

విలీన గ్రామాల పరిధిలో దాదాపు 3 వేల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. వీటిపై కేంద్ర, రాష్ట్ర సంస్థలు, పరిశ్రమలు ఏర్పాటై ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.

జిల్లా కేంద్రానికి 30 కిలోమీటర్ల దూరంలోనే రాజధాని అమరావతి రూపుదిద్దుకోవడం, విలీన గ్రామాల పరిసరాల్లో ఓఆర్‌ఆర్ (ఔటర్ రింగ్ రోడ్) వెళ్లడం కూడా కలిసొచ్చే అంశాలు.

జీఎంసీలో అదనపు కమిషనర్ పోస్టుతో పాటు మరికొన్ని విభాగాలు, పోస్టులు మంజూరవుతాయి.

సర్కిళ్లు, జోన్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని సభ్యులకు వివరించారు.

# కమల్ నగర్ డంపింగ్ యార్డును పట్టించుకోండి: ఎమ్మెల్యే కసిరెడ్డికి కవిత సూచన

కల్వకుర్తి డిసెంబర్ 29,

అమన్ గల్ లోని డంపింగ్ యార్డును తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదివారం పరిశీలించారు. కవిత మాట్లాడుతూ ఆమన్ గల్ పట్టణంలోని గుర్రగుట్టం కమల్ నగర్ లో ఉన్నాం. ఇక్కడ జనావాసాల్లో పెద్ద డంపింగ్ యార్డ్ ను పెట్టారు. దీన్ని తీసేయాలని ఆరేళ్లుగా ప్రజలు ధర్నాలు చేస్తూ దరఖాస్తులు ఇస్తున్నారు. ఈ డంపింగ్ యార్డ్ కారణంగా ప్రజలు ఆరోగ్య పరంగా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇటీవలే ఒక బాలింత కూడా చనిపోయిందని చెబుతున్నారు. ఇక్కడి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈ డంపింగ్ యార్డ్ సమస్యపై శ్రద్ధ పెట్టాలి. అధికారులకు అప్లికేషన్ ఇచ్చినప్పటికీ వాళ్లు కనీసం పట్టించుకోవటం లేదు. ఇక్కడికి 8 కిలోమీటర్ల దూరంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం కోటి 20 లక్షలు కూడా మంజూరు చేశారు. ఈ ప్రాంతంలో ప్రజలకు 1994 లో గుట్టలల్లో ఇళ్లులు ఇచ్చారు. అవి చాలా చిన్నగా ఉన్నాయి. ఇక్కడ కూడా వారిని పొమ్మన లేక పొగబెట్టినట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ ను పిలిపించుకొని ఈ ప్రాంతాన్ని పరిశీలించాలి. చెత్తశాఖ మంత్రి మీ ముఖ్యమంత్రే కనుక ఆయనను డిమాండ్ లేక కమాండ్ చేసి ఈ సమస్య పరిష్కరించాలి. మా యాత్ర ఫిబ్రవరిలో పూర్తి అవుతుంది. అప్పటి వరకు ప్రభుత్వానికి సమయం ఇస్తాం. ఆ తర్వాత మేమే ఈ డంపింగ్ యార్డ్ ను క్లీన్ చేస్తాం. ఇక్కడ ప్లాస్టిక్ గుట్టలుగా పేరుకుపోయింది. పర్యావరణం మీద పట్టి లేకుండా రోజు చెత్తను కాల్చుతున్నారు. దీంతో విషవాయువులు ప్రబలి ప్రజలకు క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది. ఇక్కడి ఎమ్మెల్యే చదవుకున్న వారు, విజ్ఞులు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తారని భావిస్తున్నామని అన్నారు.

# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 174 | హైదరాబాద్ | మంగళవారం 30-12-2025 | పేజీలు : 12 | వెల : 1.00





11లో

బంగ్లాదేశ్ ఎన్నికలు... రెండు చోట్ల నుంచి తారిఖ్ రెహ్మాన్ పోటీ

## అసెంబ్లీలో కేసీఆర్ తో..
# రేవంత్ రెడ్డి కరచాలనం..

- కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించిన ముఖ్యమంత్రి
- ఆరోగ్యం గురించి వాకబు చేసిన రేవంత్
- రెండు నిమిషాలు సభలో ఉండి వెళ్లిపోయిన కేసీఆర్ 11లో







11లో

## వరల్డ్ ర్యాపిడ్ చెస్‌లో
# మెరిసిన తెలుగు తేజాలు..

- హంపి, అర్జున్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు
- వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు
- కోనేరు హంపి, అర్జున్ ఎరిగైసిలకు సీఎం చంద్రబాబు అభినందనలు
- విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక భారతీయుడిగా అర్జున్



11లో

## గ్రేటర్ హైదరాబాద్ లో ఈకేవైసీ చేసుకోకుంటే రేషన్ కట్

- హైదరాబాద్ లోని రేషన్ లబ్ధిదారులకు డీలర్ల హెచ్చరిక
- దగ్గర్లోని రేషన్ షాపుల్లో వేలిముద్రలు ఇవ్వాలని సూచన
- పాత కార్డులతో పాటు కొత్త కార్డుదారులకూ తప్పనిసరి

# రైల్లో మంటలు..

- సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు స్పందన
- టాటానగర్-ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో ఘోర అగ్నిప్రమాదం
- ఘటనలో ఒక ప్రయాణికుడు దుర్మరణం
- రెండు కోచ్‌లను వేరు చేసి మంటలార్పిన సిబ్బంది
- ప్రమాద కారణాలపై రైల్వే శాఖ విచారణ

11లో





11లో

## పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు

- బలూచిస్థాన్‌లో భీకర దాడులు
- పలు ప్రాంతాల్లో సైనిక స్థావరాలే లక్ష్యం
- దాడులకు బాధ్యత వహించిన బీఎల్‌ఏ, బీఎల్‌ఎఫ్, బీఆర్‌జీ సంస్థలు
- సీపెక్ మార్గంలో సైనిక వాహనంపై రిమోట్ కంట్రోల్ బాంబు దాడి
- బలూచిస్తాన్ స్వాతంత్ర్యం కోసమే దాడులని ప్రకటించిన బలోచ్ గ్రూపులు

## కేసీఆర్, నేను మాట్లాడుకున్నది మీకెలా చెబుతాను



11లో

- మీడియా ప్రతినిధులతో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి
- ఆసుపత్రికి వెళ్లి కూడా కేసీఆర్‌ను కలిశానని గుర్తు చేసిన రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని వ్యాఖ్యలు
- సభలో ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చేందుకు మంత్రులు సిద్ధం కావాలని దిశానిర్దేశం

## ముగిసిన..
# ఏపీ క్యాబినెట్ సమావేశం



- ప్రజాభీష్టం మేరకు జిల్లాల పునర్వ్యవస్థీకరణకు క్యాబినెట్ ఆమోదం
- మార్కాపురం కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటుకు నిర్ణయం
- అన్నమయ్య జిల్లా పేరు యథాతథం, జిల్లా కేంద్రం మదనపల్లెకు మార్పు
- మొత్తం 24 కీలక అంశాలపై చర్చించి ఆమోదించిన మంత్రివర్గం
- జనవరి 1 నుంచి కొత్త మార్పులు అమల్లోకి 11లో

# మళ్లీ తెరపైకి లేడీ డాన్...

తిరుపతి, డిసెంబర్ 29,

త ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దందాలను దర్జాగా సాగించింది. అక్రమాలను జోరుగా నిర్వహించింది. ప్రత్యేకంగా ఒక ముఠాను ఏర్పాటు చేసుకొని సామంత రాజ్యాన్ని కొనసాగించింది. ఇప్పుడు అధికారం లేదు, గత ప్రభుత్వం పెత్తనం లేదు. అయినప్పటికీ ఆమె ఆగడాలు ఆగడం లేదు. ఇదంతా కూడా మదనపల్లిలో ఓ లేడీ డాన్ సాగిస్తున్న వ్యవహారంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మదనపల్లి కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తుంది. అధికారులు దీనికి సంబంధించి ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. కార్యాలయాలకు అనుకూలంగా ఉన్న ప్రభుత్వ భవనాలను కూడా పరిశీలిస్తున్నారు. ఇదంతా జరుగుతుండగానే మదనపల్లిలో ఓ ప్రతీపశక్తి పుట్టుకొచ్చింది. ఆమె తన కార్యకలాపాలను వేగవంతం చేసింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆమె ఆ పార్టీ నాయకులతో రకరకాల వ్యవహారాలు కొనసాగించింది. అధికారం కోల్పోవడంతో వారిని పక్కన పెట్టింది. అంతేకాదు నాటు వైసీపీలో ఉన్న ఒక కీలక నాయకుడితో ఇప్పుడు ఆమె వ్యవహారాలు సాగిస్తోంది. ఒప్పందాలు కుదుర్చుకొని దందాలు మొదలు పెట్టింది.గతంలో తాను ఆక్రమించిన భూములను బాధిత రైతులు ఇప్పుడు వెనక్కి తీసుకుంటుంటే అడ్డుకుంటున్నది. ఒక ప్రైవేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని మదనపల్లి పట్టణంలో బెదిరింపులకు పాల్పడుతోంది. తమిళనాడు, ఇతర ప్రాంతాలలో నేరచరిత్ర ఉన్న వ్యక్తులను తనకు అనుచరులుగా మార్చుకొని బెదిరింపులకు పాల్పడుతుంది. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఒక ఎస్ఐ పై ఈ లేడి డాన్ దాడి కూడా చేసింది. ఇప్పుడు అధికారంలో లేకపోయినప్పటికీ భయభ్రాంతులకు గురిచేస్తుండడంతో మదనపల్లి ప్రజలు వణికి పోతున్నారు. ఇప్పటికే బాధితులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి తమ బాధను చెప్పుకున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో కొంతమందికి సంబంధించిన భూములను ఆ లేడీ డాన్ ఆక్రమించింది. ఆమెకు అప్పట్లో కో కీలక నాయకుడు సహకరించారు. ఆ భూముల్లో కొన్నింటిని ఆ కీలక నాయకుడికి, మరొక ప్రజా ప్రతినిధి భార్యకు ఈ లేడీ డాన్ వాటా కింద రాసి ఇచ్చింది. మదనపల్లి టౌన్ లోని రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ లేడీ డాన్ మీద ఏకంగా 18 కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ కూడా పలు దశల్లో విచారణలో ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఈమె ఏకంగా 100 కోట్లకు పైగా వెలుగున్న భూములను ఆక్రమించినట్లు తెలుస్తోంది. అంతేకాదు ఆమె మీద 262/2023 కింద రౌండ్ కి కూడా నమోదు చేశారు.ఇప్పుడు మదనపల్లి కేంద్రంగా కూటమి ప్రభుత్వం జిల్లాను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఆ లేడీ డాన్ రెచ్చిపోవడం మొదలుపెట్టింది. ఎందుకంటే జిల్లా కేంద్రం అవుతున్న నేపథ్యంలో ఇక్కడి భూములకు ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో ఆ లేడీ డాన్ మదనపల్లి పట్టణంలో అత్యంత ఖరీదైన భూములను ఫోర్జరీ పత్రాలు, అక్రమంగా చేసిన రిజిస్ట్రేషన్ లతో దక్కించుకుంది. అదే కాదు, వాటిని పులివెందుల సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ చేయించుకుంది. అయితే ఆమె వ్యవహారం బయటపడిన నేపథ్యంలో బాధితులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిగిన నేపథ్యంలో అదంతా అక్రమం అని తేలింది. కోర్టు నాడు ఈ వ్యవహారంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. అదే కాదు ఆ లేడీ డాన్ మీద, భూములు రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్టర్ నాసిర్ మీద కేసులు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది.

# టూరిజం, రిపబ్లిక్ డే లక్ష్యాలపై దృష్టి

శ్రీనగర్, డిసెంబర్ 29,

న్యూ ఇయర్ రాబతోంది. కొద్ది రోజులోల వసంత కాలం వస్తుంది. ప్రస్తుతం జమ్మూ కశ్మీర్ మంచుతో అందాలు సంతరించుకుంది. ఈ తరుణంలో ఉగ్ర కదలికలు ఆందోళన కలిగిస్తున్నాయి. సరిహద్దులో చొరబాటుల పెరుగుతున్నాయి. ప్రముఖ ఉగ్రవాదుల కదలికలతో హై అలర్ట్ నెలకొంది. టూరిజం సీజన్‌లో పహల్గాం లాంటి దాడులు జరపాలని ఉగ్రవాదులు కుట్రలు పన్నుతున్నారని ఇంటెలిజెన్స్



సమాచారం.అనంత్‌నాగ్ ప్రాంతంలో లతీఫ్ భట్ కదలికలను నిఘా వర్గాలు గుర్తించాయి. అతని దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో నమోదయ్యాయి. మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ఉన్న లతీఫ్, కశ్మీర్ రెవల్యూషనరీ ఆర్మీలో కీలక నాయకుడు. అతనితోపాటు పాకిస్తాన్‌కు చెందిన హంజుల్లా కూడా సరిహద్దు దాటి భారీ కుట్రలు అమలు చేయడానికి చేరుకున్నాడని అనుమానం. ఈ ఇద్దరూ నెల రోజులుగా కశ్మీర్‌లో తిరుగుతూ తరచూ స్థావరాలు మారుస్తున్నారు. వారికి స్థానిక సహకారం ఉందా అని భద్రతా సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి. లష్కర్ ఎతోయిబా అనుబంధ సంస్థలు ఈ కార్యకలాపాలకు మద్దతు ఇస్తున్నాయని నిఘా సమాచారం.ఎల్‌లోసీ దగ్గర 80 గ్రామాల్లో భద్రతా దళాలు తీవ్ర తనిఖీలు చేపట్టాయి. 40 మంది పాకిస్తాన్ ఉగ్రవాదులు చొరబడినట్లు సమాచారం చేరుకుని, ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, జెకే పోలీసు బలగాలు కలిసి గాలిపు చేపట్టాయి. ఎన్‌గర్ ప్రాంతంలో కూడా ఇదే రీతి చర్యలు. శీతాకాల వాతావరణం చొరబాట్లకు అనుకూలంగా ఉండటంతో, పాక్ ఐఎస్ఐ మద్దతుతో మరిన్ని ఆక్రమణలు జరగవచ్చని నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. కొన్ని రోజుల క్రితం పాకిస్తాన్ 72 టెర్రర్ లాంచ్ ప్యాడ్లను పునఃస్థాపించడం ఈ కార్యకలాపాలకు సంకేతం.టూరిస్టు సీజన్ ప్రారంభానికి ఉగ్రవాదుల కదలికలు పెద్ద సవాల్. పహల్గాం లాంటి ప్రసిద్ధ ప్రదేశాల్లో దాడులు రూపొందించాలని ఉగ్రవాదులు ప్రణాబద్ధులవుతున్నారు. రిపబ్లిక్ డే వేడుకలను కూడా టార్గెట్ చేసే అవకాశం గుర్తించారు నిఘా వర్గాలు. భద్రతా దళాలు టూరిస్టు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఈ చర్యలతో ప్రజలకు ఇబ్బంది జరిగినా, భద్రతను ప్రాధాన్యత ఇచ్చారు.ఈ కదలికలు ప్రాంతీయ స్థిరత్వాన్ని బెదిరిస్తున్నాయి. పాకిస్తాన్ మద్దతు, స్థానిక సహకారాలు గుర్తించి కట్టడి చర్యలు తీసుకోవాలి. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసి, సరిహద్దు రక్షణను మెరుగుపరచడం కీలకం.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో తెరపైకి సంధ్య శ్రీధర్ రావు.




హైదరాబాద్, డిసెంబర్ 29, (న్యూస్ పల్స్)

భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కీలకమైన వ్యక్తుల ఫోన్ లు ట్యాప్ చేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో నాడు ఇంటిలిజెన్స్ భాగంలో కీలకంగా పనిచేసిన ప్రభాకర్ రావు, భుజంగరావు, రాధా కిషన్ రావు, తిరుపతన్న ను అనేక దఫాలుగా ప్రత్యేక దర్యాప్తు బృందం విచారించింది. వీరు మాత్రమే కాకుండా ఓ మీడియా సంస్థను నిర్వహిస్తున్న శ్రవణ్ రావు అనే వ్యక్తిని కూడా విచారించింది. ప్రభాకర్ రావు ను ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం గదిలో అధికారులు విచారించారు. మిగతా వారిని కూడా విచారించడానికి అదే విధానాన్ని కొనసాగించారు. చార్జిషీట్, సుప్రీంకోర్టుకు అందించే నివేదికలో ఏమాత్రం తప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంది ప్రత్యేక దర్యాప్తు బృందం. నిందితుల కన్ ఫెషన్ రిపోర్ట్ లో పలు అంశాలను పేర్కొనగా? వాటి ఆధారంగా తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. అంతేకాదు రిమాండ్ రిపోర్టులు, ఎఫ్ ఎస్ ఎల్ రిపోర్ట్ లో అంశాలతో సిట్ అధికారులు దాదాపుగా డ్రాఫ్టింగ్ పూర్తి చేశారు.సిట్ విచారిస్తున్న సమయంలో ప్రభాకర్ రావుకు సంబంధించిన మన వ్యవహారం కూడా వెలుగు వచ్చింది. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ప్రభాకర్ రావు తనను ఇబ్బంది పెట్టారని సంధ్యా కన్వెన్షన్ ఎండి శ్రీధర్ రావు ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులకు ఫిర్యాదు చేశాడు. తనను బెదిరింపులకు గురిచేసి భారత రాష్ట్ర సమితికి 12 కోట్లు ఎలక్టోరల్ బాండ్లు రాయించాడని శ్రీధర్ రావు ఆరోపించారు. అంతేకాదు, ఓ భూ వివాదంలో ప్రభాకర్ వియ్యంకుడు రవీందర్రావు కొంత డబ్బు కూడా వచ్చిందని శ్రీధర్ రావు సిట్ కు చేసిన ఫిర్యాదులో స్పష్టం చేశాడు. దీంతో రవీంద్రరావు సిట్ దర్యాప్తు చేసింది. మరోవైపు ప్రభాకర్ రావు పెద్ద కుమారుడు నిశాంత్ ను ఇప్పటికే సిట్ అధికారులు అనేక దఫాలుగా విచారించారు. నిశాంత్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అక్కడికి వచ్చిన పెట్టుబడులు, ఇతర వ్యవహారాల గురించి పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ప్రభాకర్ రావు, నిశాంత్ బ్యాంకు ఖాతాలను సిట్ అధికారులు లోతుగా పరిశీలించారు.సిట్ దర్యాప్తు పూర్తయిన తర్వాత తదుపరి వ్యవహారాన్ని కొనసాగించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభాకర్ రావు విచారణ ముగియడంతో సిట్ చీఫ్ సజ్జనార్, ఇంటలిజెన్స్ చీఫ్ విజయ్ కుమార్, సిద్దిపేట సిపి ఎస్ఎం విజయ్ కుమార్ సహా సిట్ సభ్యులు భేటీ అయ్యారు. బంజారాహిల్స్ ప్రాంతంలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లో ఈ కీలక సమావేశం నిర్వహించారు. ప్రభాకర్ రావు ను విచారించిన తర్వాత కేసు విషయంలో కీలకమైన నివేదిక సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు సుప్రీంకోర్టులో దాఖలు చేసే స్టేటస్ రిపోర్ట్ కూడా పూర్తి చేస్తున్నట్టు సమాచారం. ఒకవేళ కెసిఆర్ ను విచారణకు పిలిస్తే ఎటువంటి పరిణామాలు చోటు చేసుకుంటాయని అంశాలపై కూడా చర్చించినట్టు తెలుస్తోంది.

# పాకిస్తాన్ లో ఆపరేషన్ ధురంధర టెన్షన్..

శ్రీనగర్, డిసెంబర్ 29,

దురంధర్.. భారత్ సృష్టించిన దురంధర్‌లు పాకిస్తాన్‌లో అలజడి సృష్టిస్తున్నారు. అల్లకల్లోలం సృష్టిస్తున్నారు. ఆందోళనలు రేకెత్తిస్తున్నారు. భయం పుట్టిస్తున్నారు. ఇది పాకిస్తాన్‌లో



జరుగుతోంది. భారత్‌లో కూడా దురంధరుడి యాక్షన్స్ నడుస్తున్నాయి. దురంధర్ ఇటీవల వచ్చిన సినిమా. భారత దేశం విదేశీ గడ్డపై ఏరకంగా ఆపరేషన్లు నిర్వహిస్తుందో తెలుపుతూ వాస్తవానికి ఊహను జోడించి తీసిన సిరిమా. ఇప్పటి వరకు రూ900 కట్ల కొల్లగొట్టింది. ఈ సినిమాను ఆరు ముస్లిం దేశాలు నిషేధించాయి. నిషేధం ఉన్నా రూ.900 కోట్ల ఆదాయం సంపాదించింది. పాకిస్తాన్‌లో నిషేధం ఉన్నా.. 20 లక్షల మంది చట్టవిరుద్ధంగా డౌన్‌లోడ్ చేసి చూశారు. ఈ సినిమా దేశీయ హీరోయిజంను ప్రదర్శించడంతో పొరుగు దేశంలో ఆందోళనలు, భుజాలు తడుముకునే స్థితి నెలకొంది.నిషేధం ఉన్నా సినిమా ప్రజల మనసులో చేరి, పాకిస్తానీల్లో దేశ విధానాలపై ప్రశ్నలు లేవనెత్తింది. చట్టవిరుద్ధ మార్గాల ద్వారా చూసినవారు సంఖ్య పెరగడంతో, భారత ఆపరేషన్ల శక్తిని గుర్తించారు. ఈ ఫెనామెనా సినిమా ప్రభావాన్ని రెట్టింపు చేసింది. వాస్తవ ఘటనలకు కల్పిత భాగాలు జోడించి తీర్చిన ఈ చిత్రం, పొరుగు దేశంలో మానసిక ఒత్తిడిని పెంచుతోంది.దశాబ్దాలుగా ఇండస్ట్రీని ఆధిపత్యం చేసిన ముగ్గురు ఖాన్ స్టార్లు ఇప్పుడు కంగారుపడుతున్నారు. ఈద్ రిలీజ్‌లకు పేరుగాంచిన ఒకరు 2026 సినిమాను పోస్ట్‌పోన్ చేశారు. మరొకరు ఏడాది బ్రేక్ ప్రకటించారు. మూడో ఖాన్ నాలుగేళ్ల ప్రాజెక్ట్‌తో రెండేళ్లు మౌనంగా ఉంటాడు. మాఫియా ప్రభావంతో దేశ రహస్యాలను దెబ్బతీసే చిత్రాలు తీశారని విమర్శించిన ఒక నటుడు, ప్రేక్షకుల జవాబుతో తిరిగి సరిదిద్దుకుంటున్నాడు.కశ్మీర్ ఫైల్స్, కేరళ ఫైల్స్, ఊరి వంటి చిత్రాల స్ఫూర్తితో 'దురంధర్' వచ్చింది. ఆదిత్య ధావల్ దర్శకత్వంలో టాప్ హీరో హీరోయిజం చూపించిన ఈ సినిమా, రహస్య సంస్థల త్యాగాలను హైలైట్ చేసింది. సాధారణ దర్శకులు టాప్ లిస్ట్‌లో చేరడంతో, కథల ఎంపికలో మార్పు సంభవిస్తోంది. మత సంబంధిత మాఫియా ప్రభావం తగ్గే అవకాశం కనిపిస్తోంది.దశాబ్దాల మాఫియా ఆధిపత్యానికి ఈ జాతీయవాద చిత్రాలు అడ్డుకట్ట వేస్తున్నాయి. దుబాయ్, కరాచీ నుంచి వచ్చే ఒత్తిడులు తగ్గుతూ, కథలు పేట్రియటిక్ టోన్‌తో మారుతున్నాయి. ఈ ధోరణి కొనసాగితే, బాలీవుడ్‌లో కొత్త యుగం ప్రారంభమవుతుంది. ప్రేక్షకుల మద్దతు ఈ మార్పును మరింత బలోపేతం చేస్తోంది.

# చైనా గోల్డ్ డామినెన్..

న్యూఢిల్లీ, డిసెంబర్ 29, (

బంగారం, వెండి.. ప్రస్తుతం ఖరీదైన లోహాలుగా మారాయి. రెండేళ్లుగా వీటి ధరలు అడ్డూ అదుపు లేకుండా



పెరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో భవిష్యత్ ఈ రెండు లోహాలదే అని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. దీంతో పెట్టుబడి పెటేందుకు ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయి. ఇలాంటి తరుణంలో డ్రాగన్ కంట్రీ చైనాలో భారీగా బంగారం నిల్వలు బయటపడ్డాయి. ఈ కొత్త ఆవిష్కరణ ప్రపంచ ఖనిజ వనరుల మ్యాప్‌ను మార్చేలా ఉంది. అధిక గ్రేడ్ ఒర్‌తో కూడిన ఈ డిపాజిట్ గ్లోబల్ మార్కెట్‌పై చైనా పట్టుకు మరింత పెంచుతుంది.పింగ్‌జియాంగ్ కౌంటీలోని వాంగు గోల్డ్ ఫీల్డ్‌లో 40కి పైగా గోల్డ్ మైన్‌లు గుర్తించారు. 2 కిలోమీటర్ల లోతులో 300 టన్నులు బంగారం నిల్వలు గుర్తించారు. మొత్తం 1,000 టన్నులకు పైగా ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. టన్నుకు 138 గ్రాముల గోల్డ్ కాన్సంట్రేషన్ ? సాధారణ మైన్‌ల (10 గ్రా/టన్) కంటే 10 రెట్లు ఎక్కువ. కోర్ శాంపిల్స్‌లో కనిపించే గోల్డ్ ఈ డిపాజిట్ నాణ్యతను తెలియజేస్తోంది. 65 కి.మీ. డ్రిల్లింగ్‌తో 55 బోర్‌హోల్స్ పూర్తయ్యాయి. 2025 చివరిలో 55 టన్నులు అదనం చేసే లక్ష్యం.సౌత్ డీప్ మైన్ (900 టన్నులు) కంటే పెద్దది, కానీ గ్రేడ్ ఎక్కువగా ఉంది. చిన్న మొత్తం ఒర్ నుంచి ఎక్కువ గోల్డ్ సేకరణ సాధ్యం. హనాన్ మినరల్ రిసోర్సెస్ గ్రూప్ నిర్వహిస్తోంది. నేచర్ జియోసైన్స్ పరిశోధన ప్రకారం, క్వార్ట్జ్ రాళ్లలో భూకంప ఒత్తిడితో పైజోఎలక్ట్రిక్ చార్జ్‌లు ఏర్పడి, హాట్ ఫ్లూయిడ్స్ నుంచి గోల్డ్ వేగంగా డిపాజిట్ అవుతుంది. చైనా మధ్య భాగం టెక్టానిక్ యాక్టివిటీతో పోలిచే ప్రదేశంప్రపంచంలో 10% గోల్డ్ ప్రొడక్షన్ చైనా చేస్తోంది (2023లో 370 టన్నులు). ఈ డిపాజిట్‌తో రిజర్వులు, సప్లై చైన్‌లో ప్రభావం బలపడుతుంది. టెక్నాలజీలో (గోల్డెన్ లాయర్స్ లాంటివి) డిమాండ్ కూడా పెరుగుతోంది.

# ఎర్నాకుళం ఎక్స్ ప్రెస్ లో చెలరేగిన మంటలు

అనకాపల్లి డిసెంబర్ 29,

ఎర్నాకుళం ఎక్స్ ప్రెస్ లో మంటలు చెలరేగాయి. మంటలను గుర్తించి ఎలమంచిలి రైల్వేస్టేషన్ లో రైలును నిలిపివేసారు. బీ 1 భోగిలో మంటలు రావడంతో రైలు నుండి ఇతర కోచ్ లను వేరు చేసారు. ఎలమంచిలి రైల్వే స్టేషన్ లో ట్రైన్ ను నిలిపివేసిన వెంటనే భయంతో ప్రయాణికులు పరుగులు తీసారు. టాటా నగర్ నుండి ఎర్నాకుళం వెళ్తుండగా ఎలమంచిలి రైల్వే స్టేషన్ సమీపంలో మంటలను లోకో పైలట్ గుర్తించారు. ఎం1, బీ2 బోగీలు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ప్రయాణికులంతా సురక్షితంగా ఉండడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. రైల్వే అధికారులు రైలులో అగ్ని ప్రమాదంపై విచారణ చేపట్టారు.

# సోమేశ్వర ఆలయంలో కేంద్ర మంత్రి నిర్మల ప్రత్యేక పూజలు

కోవూరు డిసెంబర్ 29,

పశ్చిమ గోదావరి జిల్లా పోడూరు మండలం కవిటం గ్రామంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న శ్రీ సోమేశ్వర స్వామి దేవాలయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి వర్యులు శ్రీమతి నిర్మలా సీతారామన్ స్థానిక శాసనసభ్యులు శ్రీ పితాని సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రి, పాత శివాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొని వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి, ఆలయ అభివృద్ధి పనులపై అధికారులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

# రాజాసింగ్ రీ ఎంట్రీ....?

హైదరాబాద, డిసెంబర్ 29, (న్యూస్ పల్స్)

తెలంగాణలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. మొన్నటి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఆశాజనకమైన ఫలితాలు సాధించినప్పటికీ, ఆ తర్వాత ఆశించిన స్థాయిలో పార్టీ పుంజుకోలేకపోవడం ఇప్పుడు కమలనాథులను కలవరపెడుతోంది. క్షేత్రస్థాయిలో కేడర్ ఉన్నా, వారిని నడిపించే నాయకత్వ లోపం, అంతర్గత కుమ్ములాటలు పార్టీని రోజురోజుకూ బలహీనపరుస్తున్నాయి. ఈ స్తబ్ధతను బద్దలు కొట్టేందుకు ఇప్పుడు అధిష్టానం రంగంలోకి దిగింది. ముఖ్యంగా, ఫైర్ బ్రాండ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ వంటి కీలక నేతలను తిరిగి పార్టీలో క్రియాశీలం చేయడం ద్వారా మళ్లీ పునర్జీవం పోసుకోవాలని భావిస్తోంది.ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర నాయకత్వంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అధికారంలోకి వచ్చే అవకాశాలు ఉన్న రాష్ట్రంలో ఎందుకింత నిర్లక్ష్యం? ప్రతిపక్షంగా ఎందుకు విఫలమవుతున్నారు? అంటూ మోదీ రాష్ట్ర నేతలకు గట్టిగానే క్లాస్ పీకినట్లు తెలుస్తోంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయకుండా, కేవలం గాలి వాటం విజయాలపై ఆధారపడటం సరికాదని ఆయన హెచ్చరించారు. దీంతో ఢిల్లీ పెద్దల ఆదేశాల మేరకు రాష్ట్ర నాయకత్వం ఆత్మశోధనలో పడింది. పార్టీ బలోపేతానికి ఉన్న ఏకైక మార్గం.. అలిగి దూరంగా ఉన్న పాతకాపులను, సిద్ధాంతపరంగా బలంగా ఉన్న నేతలను మళ్లీ దగ్గరకు చేర్చుకోవడమేనని డిసైడ్ అయ్యారు.తెలంగాణ బీజేపీ అంటే ఠక్కున గుర్తొచ్చే పేర్లలో రాజా సింగ్ ముందు వరుసలో ఉంటారు. కరుడుగట్టిన హిందూవాదిగా, గోషామహల్ టైగర్ గా ఆయనకున్న మాస్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఒంటిచేత్తో సీటు గెలిపించిన చరిత్ర ఆయనది. అయితే, గత కొంతకాలంగా రాష్ట్ర నాయకత్వ పోకడ నచ్చక, తనకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదనే ఆవేదనతో ఆయన పార్టీని తీవ్రంగా తప్పుబట్టారు. దీంతో ఆయన్ను పార్టీ సస్పెండ్ చేసింది. ఆయన మరే ఇతర పార్టీలో చేరకుండా అలాగే సొంతంగా పోరాడుతున్నారు.రాజా సింగ్ లాంటి నేత పార్టీకి దూరమవ్వడం అంటే.. పార్టీ తన కోర్ ఓటు బ్యాంకు అయిన హిందుత్వ ఓటు బ్యాంకు దూరం చేసుకోవడమేనని విశ్లేషకులు చెబుతున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే యువత, క్షేత్రస్థాయిలో ఉండే హిందూ కార్యకర్తలు రాజా సింగ్ వైఖరికి మద్దతుగా నిలుస్తున్నారు. ఆయనను పక్కన పెట్టి పార్టీని నడపడం ఆత్మహత్యాసదృశ్యమని అనేకసార్లు రుజువైంది. రాజా సింగ్ లేని సభలు వెలవెలబోతుంటే, ఆయన అడుగుపెడితే వచ్చే ఊపు



వేరుగా ఉంటుంది. ఈ విషయాన్ని ఇన్నాళ్లకు రాష్ట్ర నాయకత్వం గుర్తించినట్లుంది.రాజా సింగ్ ను తిరిగి పార్టీలో క్రియాశీలం చేసేందుకు, ఆయన అలక పాన్పు దింపేందుకు అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రంలో పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని, నిజమైన కార్యకర్తలకు న్యాయం జరగడం లేదని రాజా సింగ్ గతంలో బాహాటంగానే విమర్శలు చేశారు. ఆయన లేవనెత్తిన అంశాల్లో వాస్తవం ఉందని గ్రహించిన అధిష్టానం, ఆయన్ను బుజ్జగించి మళ్లీ ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలని రాష్ట్ర శాఖను ఆదేశించింది. రాజా సింగ్ రీ-ఎంట్రీ కేవలం ఒక వ్యక్తి రాక మాత్రమే కాదు.. అది పార్టీలో ఒక నూతన ఉత్తేజానికి నాంది అని కేడర్ భావిస్తోంది. హైదరాబాద్ లోనే కాకుండా, తెలంగాణ వ్యాప్తంగా ఆయన పర్యటిస్తే యువతలో మళ్లీ పార్టీ పట్ల ఆకర్షణ పెరుగుతుందన్నది రాజకీయ పండితుల విశ్లేషణ.నిజానికి రాష్ట్ర నాయకత్వంలో కొందరికి రాజా సింగ్ రాక ఇష్టం లేకపోయినా, ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన అవసరం ఎంతైనా ఉందని ఒప్పుకోక తప్పని పరిస్థితి. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నా, బీఆర్ఎస్ ను దీటుగా ఎదుర్కోవాలన్నా రాజా సింగ్ వంటి గట్టి గొంతుక పార్టీకి అత్యవసరం. అందుకే, విభేదాలను పక్కనబెట్టి ఆయన్ను సాదరంగా ఆహ్వానించేందుకు రంగం సిద్ధమైంది.మొత్తానికి, మోదీ వార్నింగ్ తో తెలంగాణ బీజేపీలో మార్పు మొదలైంది. రాజా సింగ్ ను తిరిగి చేర్చుకోవడం ద్వారా పార్టీ తన తప్పులను సరిదిద్దుకుంటున్నట్లు కనిపిస్తోంది. అయితే, ఇది కేవలం ఎన్నికల స్టంట్ లా కాకుండా, నిజమైన కార్యకర్తలకు, సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న నేతలకు పట్టం కట్టేలా ఉండాలి. రాజా సింగ్ రాకతోనైనా తెలంగాణ బీజేపీలో నిద్రాణంగా ఉన్న కేడర్ మేల్కొంటుందా? పార్టీ మళ్లీ రేసులోకి వస్తుందా? అనేది రాబోయే రోజుల్లో తేలనుంది. కానీ ఒక్కటి మాత్రం నిజం.. రాజా సింగ్ లేని తెలంగాణ బీజేపీ ఉప్పు లేని పప్పు లాంటిదే!

# కొత్త ఏడాదిలో సేమ్ జోష్...

హైదరాబాద్, డిసెంబర్ 29,

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయింది. రెండో ఏడాది పాలనపై ప్రజలు అనేక అంచనాలు పెట్టుకున్నారు. ఆమేరకు పాలన అందించలేకపోయినా.. పార్టీకి ఈ ఏడాది కూడా బాగా కలిసి వచ్చింది. 2025లో ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పథకం ప్రారంభించారు. ఇక జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల్లో పార్టీ విజయం సాధించింది. దీంతో పార్టీపై ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదు అన్న భావన హస్తం నేతల్లో నెలకొంది.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం 2025 ప్రారంభంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించింది. మొదట స్థలం ఉండి ఇల్లు లేనివారిని ఎంపిక చేశారు. నియోజకవర్గానికి 3500 చొప్పున 119 నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఇక ఈ ఏడాది ఉగాది నుంచి రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. దీంతో లబ్ధిదారుల్లో సంతోషం కనిపిస్తోంది. ఇదే ఏడాది కొత్త రేషన్‌కార్డుల జారీ మొదలు పెట్టారు. 2024లో దరఖాస్తులు స్వీకరించినా.. జారీ మాత్రం ఈ ఏడాది మొదలైంది. అర్హులందరికీ కార్డులు జారీ అయ్యాయి. దీంతో రేవంత్ సర్కార్‌పై సానుకూలత నెలకొంది. అయితే సన్నవడ్ల బోనస్ యాసంగిలో ఇవ్వలేదు. ఇక మహిళలకు రూ.2,500 నగదు, పింఛన్ల పెంపు హామీ నెరవేరలేదు.ఈ ఏడాది ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం అమలు చేశారు. మహిళా సంఘాలకు క్యాంటీన్లు, బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు ఇచ్చారు. మహిళల ఆర్థిక శక్తి పెంపే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీంతో మహిళా సంఘాల్లో రూ.2,500 ఆర్థికసాయం అందలేదన్న ఆలోచన కలుగడం లేదు. ఇక ఉచిత బస్సు ప్రయాణం కొనసాగుతోంది. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ పథకాలు అమలవుతున్నాయి. 2025లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు నిర్వహించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మరణంతో ఉప ఎన్నికలు వచ్చాయి. బీఆర్ఎస్ స్థానం అయిన జూబ్లీహిల్స్‌లో హస్తం పార్టీ విజయం సాధించింది. ఈ ఎన్నికలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. సమష్టిగా పనిచేసి విజయం సాధించారు. ఇక డిసెంబర్‌లో నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లోనూ హస్తం పార్టీ సత్తా చాటింది. కాంగ్రెస్ మద్దతుదారులు అత్యధిక స్థానాల్లో విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో కొత్త జోష్ కనిపిస్తోంది.స్థానిక సంస్థల్లో బీజీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రేవంత్‌రెడ్డి




ప్రభుత్వం ప్రయత్నం చేసింది. అసెంబ్లీ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపగా ఆయన ఆమోదం తెలుపలేదు. దీంతో చట్టరూపం దాల్చలేదు. అయినా రేవంత్ సర్కార్ జీవో ద్వారా రిజర్వేషన్ల అమలుపై జీవో ఇచ్చింది. అయితే దీనిని కోర్టులు కొట్టేశాయి. దీంతో రేవంత్ సర్కార్ ప్రయత్నించింది అన్న భావన బీసీల్లో నెలకొంది. దీంతో పంచాయతీ ఎన్నికలోల సానుకూల ఫలితాలు వచ్చాయి.ఇక బీఆర్ఎస్ నుంచి గెలిచి. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల విషయంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు స్పీకర్‌ను ఆదేశించింది. దీంతో గడ్డం ప్రసాద్‌కుమార్ విచారణ పూర్తి చేశారు. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల వివరణ తీసుకున్నారు. కడియం శ్రీహరి, దానం నాగేందర్ మినహా 8 మంది వివరణ ఇచ్చారు. ఇందులో ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ బీఆర్ఎస్ ఫిర్యాదులను కొట్టేశారు. మరో ముగ్గురి విషయంలో త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.మొత్తంగా 2025 హస్తం పార్టీకి కలిసి వచ్చిందనే చెప్పాలి. ఎన్నికల్లో విజయాలు. పథకాల అమలులో జాప్యం జరిగినా వ్యతిరేకత లేకపోవడం, పాలన సాఫీగా సాగిపోవడంతో రేవంత్‌రెడ్డి ఊపిరి పీల్చుకున్నారు.

# మహిళలకు మొబిలిటీ కార్డు...

హైదరాబాద, డిసెంబర్ 29,




తెలంగాణలో మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం మహాలక్ష్మీ పథకాన్ని అమల్లోకి తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకుంటున్న మహిళల కోసం? కామన్ మొబిలిటీ కార్డ్ జారీ చేయనుంది.ప్రస్తుతం ఆధార్ కార్డుతో ప్రయాణిస్తున్న సమయంలో ఎదురవుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ఈ స్మార్ట్ కార్డుల విధానాన్ని ప్రవేశపెడుతోంది. దీని రూపకల్పన కోసం ప్రభుత్వం ఇప్పటికే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)తో ఒప్పందం చేసుకుందిఈ స్మార్ట్ కార్డు కేవలం బస్ పాస్ మాత్రమే కాదు, బహుళ ప్రయోజనకారిగా ఉపయోగపడనుంది. మహిళలు బస్సుల్లో ఈ కార్డును ట్యాప్ చేసి ఉచితంగా ప్రయాణించవచ్చు. అంతేకాకుండా ఇందులో డబ్బులు లోడ్ చేసుకుని మెట్రో రైలు, ఎంఎంటీఎస్ వంటి ఇతర రవాణా సేవలను కూడా వినియోగించుకోవచ్చు. దీనివల్ల ప్రయాణికులు ప్రతిసారీ ఆధార్ కార్డును వెంట తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు.ఈ కార్డుల జారీతో ప్రభుత్వానికి ప్రయాణికుల డేటా కచ్చితంగా అందుబాటులోకి వస్తుంది. ఏయే మార్గాల్లో మహిళల రద్దీ ఎక్కువగా ఉందో గుర్తించి, దానికి అనుగుణంగా బస్సు సర్వీసులను సర్దుబాటు చేసే అవకాశం కలుగుతుంది. దీనివల్ల ఆర్టీసీకి నష్టాలు తగ్గడమే కాకుండా, రవాణా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. భవిష్యత్తులో రేషన్, ఆరోగ్య సేవలు, ఇతర ప్రభుత్వ పథకాలను కూడా ఇదే కార్డుకు అనుసంధానించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముందుగా మహిళలతో ప్రారంభించి, దశలవారీగా రాష్ట్ర ప్రజలందరికీ ఈ కార్డులను అందుబాటులోకి తీసుకురానున్నారు.మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు మహిళలు సుమారు 255 కోట్ల ఉచిత ప్రయాణాలు చేశారు. దీనికోసం ప్రభుత్వం ఆర్టీసీకి రూ. 8,500 కోట్లు చెల్లించింది. అయితే, ప్రయాణ సమయంలో ఆధార్ కార్డు చూపించడం వల్ల కండక్టర్లు, ప్రయాణికుల మధ్య తరచూ ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఆధార్‌పై ఫొటోలు స్పష్టంగా లేకపోవడం, నకిలీ కార్డుల వినియోగం వంటి సమస్యలను అధిగమించేందుకు ప్రభుత్వం

# చెట్టు కోసం అలైన్ మెంట్ మార్పు...

హైదరాబాద్, డిసెంబర్ 29,

వినాశనం లేకుండా వికాసం సాధ్యం కాదు అంటారు. ఇప్పటివరకు జరిగిన వికాసం మొత్తం వినాశనం తర్వాతే చోటుచేసుకుంది. ఇప్పటికైతే ప్రకృతి తన వినాశనాన్ని తట్టుకుంది కానీ.. ఇకపై తట్టుకునే అవకాశం లేదు. ఎందుకంటే ఇప్పటికే ప్రకృతిలో అనేక రకాల మార్పులు చోటుచేసుకుంటుంది. కాలం కాని కాలంలో వర్షాలు కురుస్తున్నాయి. ఎండల గురించి, శీతల గాలుల గురించి ఇక ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు.. దాని పర్యవసనాలు మనిషి జీవితం మీద తీవ్రమైన ప్రభావం చూపిస్తున్నాయి. వినాశనం లేకుండా వికాసం వైపు అడుగులు వేయాలంటే సాధ్యమయ్యే పని కాదు. అయితే దీనిని సాధ్యం చేసి చూపించారు. అది కూడా తెలంగాణ రాష్ట్రంలో..తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరానికి దగ్గరలో ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు ను ఆనుకుని బీజాపూర్ రహదారి నిర్మిస్తున్నారు. 2018లో ఈ రోడ్డు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. అయితే ఎన్ని రోజులపాటు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో ఈ కేసు పెండింగ్లో ఉంది. దీంతో ఇన్ని సంవత్సరాలపాటు ఈ రోడ్డు నిర్మాణం ఆగిపోయింది.నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసు పరిష్కారం కావడంతో రోడ్డు నిర్మాణ పనులకు మోక్షం లభించింది. 18 నెలల కాలంలోనే ఈ పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలంగాణ పోలీస్ అకాడమీ వద్ద ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు నుంచి మొయినాబాద్, చేవెళ్ల మీదుగా మన్నెగూడ వరకు బీజాపూర్ రోడ్డు విస్తరణ చేస్తున్నారు. దాదాపు 46 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారిని 60 మీటర్ల వెడల్పుతో నాలుగు వరుసలలో నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి కేంద్రం ఏకంగా 956 కోట్ల నిధులను మంజూరు చేసింది. బైపాస్ రోడ్డు ను చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంతాలలో నిర్మిస్తున్నారు. ఎనిమిది నెలల క్రితం బైపాస్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు 50 శాతం పనులను పూర్తి చేశారు. గత నెల 3న చేవెళ్ల మండలంలో మిర్జాగూడ ప్రాంతంలో ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీ కొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో 19 మంది చనిపోయారు. దీంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. దాదాపు ఈ రోడ్డు నిర్మాణంలో 15 అండర్ పాస్ లను నిర్మిస్తున్నారు. ఈ రోడ్డు హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రాన్ని కలుపుతూ ఉంటుంది. వాహన రద్దీకి అనుగుణంగా ఈ రోడ్డును నిర్మిస్తున్నారు. ఇది గతంలో అంతరాష్ట్ర రహదారిగా ఉంది. 2018లో కేంద్రం దీన్ని జాతీయ రహదారిగా గుర్తించింది. దీనికి ఎన్ హెచ్ 163 అని పేరు పెట్టింది. ఈ రోడ్డుకు ఇరువైపులా మర్రి చెట్లు ఉన్నాయి. రోడ్డు నిర్మాణంలో మర్రి చెట్లను తొలగించకూడదని ఓ సంస్థ చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించింది. దీంతో పనులు ఎక్కడికి అక్కడ ఆగిపోయాయి. ఈ క్రమంలోనే మర్రి చెట్లను తొలగించకుండా అలైన్మెంట్లో మార్పులు చేశారు. దీంతో మర్రి చెట్లు అలాగే ఉన్నాయి. రోడ్డు నిర్మాణంలో ఆ లైన్ మెంట్ మార్పు వల్ల చెట్లు బతికి బట్ట కట్టాయి.

--------------------

# సింగిల్ డిజిట్ కు టెంపరేచర్

హైదరాబాద్, డిసెంబర్ 29,

తెలంగాణ రాష్ట్రాన్ని తీవ్రమైన చలి వణికిస్తోంది. గత కొన్ని రోజులుగా ఉత్తర, దక్షిణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు నమోదైన గణాంకాలను పరిశీలిస్తే.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు)లో అత్యల్పంగా 7.1 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 7.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిర్మల్ వంటి జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల లోపే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

రాబోయే సోమ, మంగళవారాల్లో చలి ఇంకా పెరిగే అవకాశం ఉందని.. సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ 14 జిల్లాలకు 'ఆరెంజ్' అలర్ట్ జారీ చేసింది.ఈ తీవ్రమైన చలి గాలుల నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యవసరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చలి ప్రభావం వల్ల కేవలం జలుబు, దగ్గు మాత్రమే కాకుండా.. రక్తపోటు పెరగడం, కీళ్ల నొప్పులు, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణీలు ఈ సమయంలో బయట తిరగకపోవడమే మంచిదని చెబుతున్నారు. చలి నుంచి రక్షణ పొందడానికి ఉన్ని దుస్తులు, స్వెటర్లు, మఫ్లర్లు, సాక్సులు తప్పనిసరిగా ధరించాలని.. పడక గదిలో వెచ్చదనం ఉండేలా చూసుకోవాలన్నారు.ఎప్పుడూ వేడిగా ఉండే తాజా ఆహారాన్ని తీసుకోవాలని.. ఇది శరీరాన్ని లోపలి నుంచి వెచ్చగా ఉంచుతుందని చెబుతున్నారు.

# ఫస్ట్ నుంచి నూమాయిష్...

హైదరాబాద్, డిసెంబర్ 29,

బాగ్యనగర సంస్కృతికి నిదర్శనమైన నాంపల్లి నుమాయిష్ 85వ ఎడిషన్ జనవరి 1 నుంచి ప్రారంభం కానుంది. ఈ ప్రదర్శన ఫిబ్రవరి 15 వరకు మొత్తం 46 రోజుల పాటు కొనసాగుతుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.



దేశవిదేశాలకు చెందిన సుమారు 2,000 స్టాళ్లను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. ప్రవేశ రుసుము రూ.50 కాగా.. ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచితం. సందర్శకుల కోసం ఉచిత పార్కింగ్, మెట్రో రాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. అగ్నిప్రమాదాల నివారణకు 82 ఫైర్ పాయింట్లు, ప్రత్యేక నిఘా టవర్లను ఏర్పాటు చేశారు.హైదరాబాద్ సంస్కృతిలో విడదీయలేని భాగమైన ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ (నుమాయిష్) మరోసారి అలరించేందుకు సిద్ధమైంది. జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రదర్శన గురించి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం కీలక వివరాలను వెల్లడించారు. సుమారు 85 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రదర్శన.. హైదరాబాద్ వాసులకు కేవలం షాపింగ్ వేదిక మాత్రమే కాదు.. ఒక భావోద్వేగంతో కూడిన వేడుక అని ఆయన పేర్కొన్నారు.85వ నుమాయిష్ జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు మొత్తం 46 రోజుల పాటు వైభవంగా సాగనుంది. జనవరి 1న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ ప్రదర్శనను అధికారికంగా ప్రారంభిస్తారు. సాధారణ రోజుల్లో ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10.30 గంటల వరకు ఉంటుంది. శని, ఆదివారాలు మరియు ప్రభుత్వ సెలవు దినాల్లో రాత్రి 11 గంటల వరకు సందర్శకులకు అనుమతి ఉంటుంది.ప్రవేశ రుసుము ఒక్కొక్కరికి 50 రూపాయలుగా నిర్ణయించారు. అయితే.. 5 ఏళ్లలోపు పిల్లలకు ప్రవేశం పూర్తిగా ఉచితం. ఈసారి నుమాయిష్‌లో గతంలో కంటే ఎక్కువ స్టాళ్లు, వైవిధ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉండనున్నాయి. దేశ విదేశాలకు చెందిన ఉత్పత్తులతో మొత్తం 2,000 కంటే ఎక్కువ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 1,050 మంది తయారీదారులు, కళాకారులు తమ నైపుణ్యాన్ని ఇక్కడ ప్రదర్శించనున్నారు.మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే ఉద్దేశంతో వారికి స్టాళ్ల కేటాయింపులో ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. రిజర్వ్ బ్యాంక్, అటవీ శాఖ, పర్యాటక శాఖ వంటి ప్రభుత్వ విభాగాలు కూడా తమ సేవలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నాయి. సందర్శకుల కోసం 20కి పైగా ఫుడ్ కోర్టులు అందుబాటులో ఉంటాయి. ఇక్కడ హైదరాబాద్ ప్రత్యేక రుచులతో పాటు వివిధ ప్రాంతాల వంటకాలను ఆస్వాదించవచ్చు.సుమారు 25 లక్షల మంది సందర్శకులు వస్తారని అంచనా వేస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని 82 ఫైర్ పాయింట్లు ఏర్పాటు చేశారు. లక్షన్నర లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు నీటి సంపులను సిద్ధం చేశారు. ప్రతి రెండు పాయింట్లకు ఒక అగ్నిమాపక సిబ్బంది పహారా కాస్తారు. పర్యవేక్షణ కోసం ప్రత్యేక వాచింగ్ టవర్లు, సీసీటీవీ కెమెరాలను అమర్చారు. 330 మంది వలంటీర్లు సందర్శకులకు సహకరించనున్నారునాంపల్లి, గాంధీ భవన్ మెట్రో స్టేషన్ల నుంచి రాత్రి 12 గంటల వరకు మెట్రో రైళ్లు అందుబాటులో ఉంటాయి. ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులను నడిపిస్తోంది. సందర్శకుల కోసం ఉచిత పార్కింగ్ సౌకర్యాన్ని కూడా కల్పించారు.నుమాయిష్ కేవలం వ్యాపార కేంద్రం మాత్రమే కాదు.. ఒక విద్యా నిధి కూడా. ఈ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయంతో ఎగ్జిబిషన్ సొసైటీ సుమారు 19 విద్యా సంస్థలను నిర్వహిస్తోంది. ఇందులో దాదాపు 30 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 2 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఈ ప్రదర్శన కీలక పాత్ర పోషిస్తోంది. షాపింగ్, వినోదం , సామాజిక సేవల కలయికగా సాగే నాంపల్లి ఎగ్జిబిషన్, ఈ ఏడాది కూడా హైదరాబాద్ వాసులకు సరికొత్త అనుభూతిని అందించబోతోంది.

# సహకారం ఎప్పటికీ ఉంటది

## డబ్ల్యూ జే ఐ జిల్లా కమిటీని సన్మానించిన అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి



కరీంనగర్, డిసెంబర్ 29(భారతశక్తి ప్రతినిధి)

వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (బిఎంఎస్ అనుబంధం)జిల్లా సంఘానికి తనవంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం కొత్తపల్లి మండలం అల్ఫోర్స్ ఈ టెక్నో పాఠశాలలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా నూతన అధ్యక్షుడు దారం జగన్నాథరెడ్డితో పాటు జిల్లా కమిటి సభ్యులు నరేందర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు..ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి అధ్యక్షుడు దారం జగన్నాథ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడాల శ్రీనివాస్,కోశాధికారి చిట్టిమల్ల మహేందర్,సంయుక్త కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ రెడ్డిలను సన్మానించారు.అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. డబ్ల్యూజేఐ జిల్లా కార్యవర్గానికి తన వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. సంఘ నూతన కార్యవర్గం జర్నలిస్టుల సమస్యలతో పాటు ప్రజా ప్రయోగ కార్యక్రమాలు కూడా చేపట్టాలని ఆకాంక్షించారు.

# గర్గుల్ గ్రామంలో నాటు బాంబు పేలిన ఘటనలో ఓ కుక్క మృతి



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 29: కామారెడ్డి మండల పరిధిలోని గర్గుల్ గ్రామంలో నాటు బాంబు పేలి కుక్క మృతి చెందింది. గ్రామస్తుల వివరాల మేరకు ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గర్గుల్ గ్రామానికి చెందిన మొగుళ్ల సాయాగౌడ్ కు చెందిన పంట చేనులో శనివారం ఉదయం సమయంలో సాయాగౌడ్ తమ్ముడు రామా గౌడ్ పొలానికి నీళు పారించడానికి వెళ్ళాడు. అదే అటుగా భారీ శబ్దం రావడంతో వెళ్లి చూడగా ఓ కుక్క తల పగిలి చనిపోయింది. ఆ ప్రాంతంలో పొగ రావడాన్ని గమనించిన రామా గౌడ్ నాటు బాంబు పేలినట్టు గుర్తించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తమ పంట చేనులో బాంబులు పడేసి ఉండటంతో అది తెలియని కుక్క నోట పట్టుకోవడంతో తలపగిలి మృతి చెందినట్లు తెలిపారు. తమకు హాని చేయడానికే బాంబులు పడేసి ఉంటారని బాధిత పంట చేను రైతు అనుమానం వ్యక్తం చేస్తూ, పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ చేనులో బాంబులు పడేసి తమకు హాని కలిగించాలని ప్రయత్నించిన గుర్తు తెలియని వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సాయాగౌడ్ తో పాటు చుట్టుపక్కల రైతులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కాగా పేలుడు ఘటనకు సంబంధించి పోలీసులు విచారణ జరుపుతున్నారు. అడవి పందుల కోసం ఎవరైనా పెట్టి ఉంటారా? లేదా కావాలని పెట్టారా అనేది పోలీసుల విచారణలో తేలనుంది.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించిన ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 29: పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, కామారెడ్డి పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ స్పష్టం చేశారు. విద్యానగర్ పరిధిలోని వార్డ్ నెంబర్ 33, 34లలో జన్మభూమి రోడ్డుకు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు.

ఈ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకల సమస్యలు తొలగి, వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. అదేవిధంగా 46వ వార్డు చోటా కసాబ్ గల్లీలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు కూడా మహమ్మద్ అలీ షబ్బీర్ శంకుస్థాపన చేశారు.

ఈ ప్రాంతం ఎన్నాళ్లుగానో మౌలిక వసతుల కొరతతో ఇబ్బందులు పడుతోందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దశలవారీగా అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని అన్నారు. “కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో ఎక్కడా వెనక్కు తగ్గేది లేదు. పట్టణం అయినా, గ్రామం అయినా సమానంగా అభివృద్ధి జరగాలన్నదే మా లక్ష్యం. ప్రజల అవసరాలే ప్రభుత్వానికి మార్గదర్శకం” అని అన్నారు. గత ప్రభుత్వాలు పట్టించుకోని ప్రాంతాలను గుర్తించి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు.కామారెడ్డి పట్టణాన్ని సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్

ములుగు జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 29 (భారత శక్తి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు.

సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి



నిర్వహించారు . అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సి హెచ్ మహేందర్ జి, (స్థానిక సంస్థలు) సంపత్ రావు, ఆర్డీవో వెంకటేష్ లతో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. మొత్తం 59 దరఖాస్తులు రాగా అందులో భూ సమస్యలు 12, గృహ నిర్మాణ శాఖకు 08, పెన్షన్ 09, ఉపాధి కల్పనకు 05, ఇతర ఇతర శాఖలకు సంబంధించినవి 25 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల పరిష్కార వేదికగా నిలవాలి:జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



సంగారెడ్డి, డిసెంబర్ 29(భారత శక్తి)

ప్రజావాణి కార్యక్రమము ప్రజా సమస్యల పరిష్కార వేదికగా నిలవాలని,అందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు.కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, డి ఆర్ వో పద్మజారాణిలతో కలిసి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా అర్జీదారులు భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, ఉద్యోగ కల్పన,తదితర అంశాలతో పాటు పంచాయతీరాజ్ఇంజనిరింగ్, విద్యుత్, వ్యవసాయ, హార్టికల్చర్, విద్య, హౌసింగ్, లేబర్, పి డబ్ల్యూ డి, మిషన్ భగీరథ, మున్సిపల్, పోలిస్, మైనారిటి వెల్ఫేర్ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు.ఆయా వినతులను పరిశీలించి త్వరిత గతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకుఆదేశించారు.ప్రజావాణి లో 39 అర్జీలు అందాయని తెలిపారు.ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమమని , అర్జి దారుల సమస్యలను వేగ వంతంగా పరిష్కరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,డి ఆర్ ఓ పద్మజారాణి , నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, కలెక్టరేట్ ఏ ఓ, ప్రజలు, పాల్గొన్నారు .

# అర్ధవంతమైన లక్ష్యాలను సాధించాలి: జేఎన్ యూ ప్రొఫెసర్ డాక్టర్ గుడవర్తి అజయ్

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, డిసెంబర్ 29:

నేటి తరం విద్యార్థులు అర్థవంతమైన లక్ష్యాలను సాధించాలని, సమాజానికి సృజనాత్మకంగా దోహదపడాలని న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్ యూ)లోని రాజకీయ అధ్యయనాల కేంద్రం అసోసియేట్ ప్రొఫెసర్, ప్రముఖ రాజకీయ సిద్ధాంతకర్త, విశ్లేషకుడు డాక్టర్



అజయ్ గుడవర్తి సూచించారు.గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని రాజకీయ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం ‘జెన్ జీ (నేటి యువత) ? భారత ప్రజాస్వామ్య భవిష్యత్తు’ అనే అంశంపై ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. ప్రజాస్వామ్యంలో జెన్ జీ యొక్క ప్రమేయంపై సూక్ష్మ అవగాహనను అందించారు. విలువలు, నీతి, రాజకీయ పద్ధతులలో వేగవంతమైన అంతర్గత మార్పులను డాక్టర్ అజయ్ ప్రముఖంగా ప్రస్తావించారు. జెన్ జీ రాడికల్ వ్యక్తిత్వం, సామాజిక ఉదాసీనతను ప్రదర్శిస్తున్నప్పటికీ, అది ఏకకాలంలో తక్కువ పక్షపాతంతో, మరింత సమ్మిళితంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. సమకాలీన యువత నేతృత్వంలోని రాజకీయ ఉద్యమాలు ఎక్కువగా నాయకత్వం లేనివి, ఎపిసోడిక్ గా ఉన్నాయని, సామూహిక రాజకీయాల యొక్క సాంప్రదాయ భావనలను పునర్నిర్మించే సైద్ధాంతిక బోధన కంటే ఆదర్శప్రాయమైన చర్య ద్వారా నడపబడుతున్నాయని అన్నారు.జెన్ జీను వర్ణించే విశ్వాసం, ఆందోళన యొక్క వైరుధ్యాలను డాక్టర్ అజయ్ గుడవర్తి మరింత విపులీకరించారు. దీనిని సరళీకరణ అనంతర యుగంలో కుంచించుకుపోతున్న ఆర్థిక అవకాశాలతో పాటు విస్తరించిన సామాజిక ప్రజాస్వామ్యానికి అనుసంధానించారు. నేటి యువత రాజకీయాలను రూపొందించడంలో గుర్తింపు, రాజకీయ ఆత్మాశ్రయత, వినియోగం యొక్క పెరుగుతున్న కలయికను కూడా ఆయన నొక్కి చెప్పారు. చివరగా విద్యార్థులు, పలువురు అధ్యాపకులతో ముఖాముఖి చర్చించి, వారి సందేహాలను నివృత్తి చేశారు.ఈ ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని సుప్రీ రంజన్ సమన్వయం చేశారు. జీఎస్ హెచ్ఎస్ ఇన్-ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ తరు, డాక్టర్ మయాంక్ మిశ్రా, రిషిజా సింగ్, పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజావాణి కి 91 దరఖాస్తులు : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 29: ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో



భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి 91 దరఖాస్తులు వచ్చాయని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించి ఆయా శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యల పరిష్కారానికి అధికారులకు అర్జీలను ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని తెలిపారు.

ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విక్టర్, సంబంధిత ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




# కలెక్టర్ ఆధ్వర్యంలో 07,08 జనవరి 26 న జరుగు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్, ఇన్స్పైర్ అవార్డ్స్ సంబంధించిన జిల్లా స్థాయి సమావేశము

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) డిసెంబర్ 29: సోమవారం రోజున జిల్లా మెజిస్ట్రేట్ శ్రీ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో జనవరి 07, నుండి 09; 2026 వరకు జరుగు రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్, ఇన్స్పైర్ అవార్డ్స్ సంబంధించిన జిల్లా స్థాయి సమావేశము నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ, పోలీస్ డిపార్ట్మెంట్ మెడికల్ డిపార్ట్మెంట్ పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్, మున్సిపల్ డిపార్ట్మెంట్ సంబంధించినటువంటి జిల్లా స్థాయి అధికారులు పాల్గొనడం జరిగింది. రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్, ఇన్స్పైర్ అవార్డ్స్ కార్యక్రమాన్ని తప్పనిసరిగా సఫలీకృతం చేయాలని సూచించడం జరిగింది. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కావలసిన సూచనలు దిష నిర్దేశము జిల్లా విద్యాశాఖాధికారి చేయడం జరిగింది.

# ఓటుంటే 'ఓటమి' భయం..

## నామినేటెడ్‌తోనే 'నమ్మకం'!

### సహకార ఎన్నికలపై సర్కారు వెనకడుగు

కరీంనగర్, భారతశక్తి ప్రతినిధి, డిసెంబర్ 29

తెలంగాణలో సహకార రంగం ఇప్పుడు రాజకీయ చదరంగంగా మారింది. రైతన్న నేరుగా ఓటు వేసే పరిస్థితి వస్తే ఫలితం తలకిందులవుతుందని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం.. వ్యూహాత్మకంగా 'ఎన్నికల' చాప్టర్‌ను పక్కన పెట్టి 'నామినేటెడ్' పర్వానికి తెరలేపింది. పీఏసీఎస్ (ఖంఅూ), డీసీసీబీ (ఆఅఅః) పాలకవర్గాల రద్దు వెనుక ప్రజాస్వామ్య విలువల కంటే రాజకీయ మనుగడ కోణమే ఎక్కువగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రైతు తీర్పుపై గుబులు!

ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల సెగ రేవంత్ సర్కారుకు గట్టిగానే తగిలింది. పల్లెల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు యూరియా కొరత, మద్దతు ధర లేకపోవడం, రైతు భరోసాలో జాప్యం ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను పెంచాయి. ఈ వ్యతిరేకత సహకార ఎన్నికల్లో ప్రతిఫలిస్తే, అది పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తుందని కాంగ్రెస్ పెద్దలు ఆందోళన చెందుతున్నారు. అందుకే, రైతులు ఓటు వేసే ఏ ఎన్నికలకైనా ప్రస్తుతానికి 'బ్రేక్' వేయడమే ఉత్తమమని సర్కారు భావిస్తోంది.

నామినేటెడ్ కమిటీల వ్యూహం

ఎన్నికలు నిర్వహిస్తే బీఆర్ఎస్ సానుభూతిపరులు లేదా అసమ్మతి నేతలు గెలిచే అవకాశం ఉందని ఇంటిలిజెన్స్ వర్గాల సమాచారం. ఈ ముప్పును తప్పించుకోవడానికి ప్రభుత్వం ఒక మధ్యేమార్గాన్ని ఎంచుకుంది.

ఎన్నికలు వద్దు:

ప్రత్యక్ష ఎన్నికలు జరిపి రిస్క్ తీసుకోవడం కంటే, కాలయాపన చేయడమే మేలని నిర్ణయించుకుంది.

పదవుల పంపకం: మార్కెట్ కమిటీల తరహాలో నామినేటెడ్ పద్ధతిలో చైర్మన్లను, డైరెక్టర్లను నియమించడం ద్వారా తమ పార్టీ కార్యకర్తలను సంతృప్తి పరచవచ్చని భావిస్తోంది.

రైతు ఓటుకు దూరం: ఈ పద్ధతి ద్వారా రైతు ఓటుతో సంబంధం లేకుండానే సహకార వ్యవస్థపై పట్టు సాధించవచ్చనేది ప్రభుత్వ ప్లాన్.

గతపాలకులపై కక్ష సాధింపా?

మెజారిటీ పీఏసీఎస్‌లలో పాత పాలకవర్గాలే కొనసాగుతుండటం, వారు ప్రభుత్వానికి సహకరించడం లేదనే నెపంతో ఈ రద్దు ప్రక్రియ చేపట్టినట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికల్లో తగిలిన దెబ్బకు ఇది ఒక రకమైన 'కౌంటర్' అని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ముగింపు: ఓటు వేసే హక్కును రైతుకు దూరం చేసి, నామినేటెడ్ పద్ధతిలో అధికారాన్ని కట్టబెట్టడం సహకార స్ఫూర్తికే విరుద్ధమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భయం నీడలో తీసుకున్న ఈ నిర్ణయం పల్లెల్లో ఎలాంటి ప్రకంపనలు సృష్టిస్తుందో చూడాలి.

# న్యాయ విజ్ఞాన సదస్సు

కడప, డిసెంబర్ 29(భారత శక్తి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, డాక్టర్




సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు పానెల్ న్యాయవాదులచే కడప నగరం ఆటోనగర్ నందు

28-12-2025 వ తేదీన భారతదేశవ్యాప్తంగా పర్యావరణ చట్టపరమైన అక్షరాస్యత మరియు సమాజ రక్షణ చొరవ "ఈరోజు రక్షించు, రేపు సురక్షితం" మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగినది.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘన వ్యర్థాలను సరిగ్గా పారవేయకపోవడం అపరిశుభ్రమైన పరిస్థితులను సృష్టిస్తుంది మరియు ఈ పరిస్థితులు పర్యావరణాన్ని కలుషితం చేస్తాయి మరియు వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తికి దారితీస్తాయి, పొడి చెత్త తడి చెత్త, తాగునీరు,

ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రభుత్వ కార్యక్రమాలు: వేస్ట్ టు వెల్త్ పోర్టల్, స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహన, చెత్త రహిత నగరాల యొక్క స్టార్ రేటింగ్, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ (ఖచిఓ) నియమాలు, 2016, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ నియమాలు, 2016.

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 48 (ం) 51 (ం) (ఞ) నిబంధనల కింద పర్యావరణ పరిరక్షణ ను పొందుపరిచారు . ఇలా జీవవైవిధ్యాన్ని కాపాడటానికి ప్రభుత్వానికి సర్వహక్కులు ఇచ్చిన మొదటి దేశం భారతదేశం. పర్యావరణ సంరక్షణ చట్టం 1986, వాయు కాలుష్య నివారణ నియంత్రణ చట్టం 1981, నీటి కాలుష్య నివారణ నియంత్రణ చట్టం 1974, హానికర వ్యర్థాల నియంత్రణ చట్టం 1989, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనల చట్టం 1998, ధ్వని కాలుష్యం నియంత్రణ చట్టం 2000, ప్లాస్టిక్ రీసైకిల్ ఉత్పత్తి వాడక చట్టం 2003, జాతీయ హరిత ట్రిబ్యునల్ చట్టం 2010, అటవీ హక్కుల గుర్తింపు చట్టం 2006 చట్టాలను వివరించడం జరిగినది.

# దక్షిణ మధ్య రైల్వే 2025 సంవత్సరంలో సాధించిన విజయాలపై స్థూల సమీక్ష

సికింద్రాబాద్, డిసెంబర్ 28(భారత శక్తి ):

దక్షిణ మధ్య రైల్వే 2025 క్యాలెండర్ సంవత్సరంలో, అన్ని రంగాలలో స్థిరమైన వృద్ధిని నమోదు చేసింది. ఈ కాలంలో, ఈ జోన్ మౌలిక సదుపాయాల అభివృద్ధి, నూతన రైళ్ల ప్రవేశపెట్టడం, స్టేషన్ల అభివృద్ధి, ప్రయాణికులకు సౌకర్యాల పెంపు, సిబ్బంది సంక్షేమం, లోడింగ్, రాబడి సృష్టి మరియు భద్రతను పెంపొందించడం మొదలైన విషయాలలో నూతన శిఖరాలను అధిరోహించి, అనేక మైలురాళ్లను దాటింది. 2025 క్యాలెండర్ సంవత్సరంలో నమోదు చేయబడిన కొన్ని ప్రధాన కార్యక్రమాలు కాలక్రమానుసారం ఈ క్రింద వివరించబడ్డాయి.

– తెలంగాణ రాజధాని నగర ప్రాంతంలోని (హైదరాబాద్) మూడు ప్రధాన టెర్మినళ్లలో రద్దీని తగ్గించడానికి మరియు రైలు ప్రయాణికులకు సులభమైన, ఇబ్బంది లేని ప్రయాణాన్ని అందించడానికి, చర్లపల్లిలో ఒక నూతన శాటిలైట్ టెర్మినల్ అభివృద్ధి చేయబడి, గౌరవ ప్రధానమంత్రి గారిచే జనవరి 2025లో ప్రారంభించబడింది.

–దక్షిణ మధ్య రైల్వే వైద్యుల సమాజంలో జ్ఞానాన్ని పంచుకోవడానికి ఒక ప్రత్యేక చొరవ తీసుకుంది . ఇందులో భాగంగా జోన్ లోని వైద్య విభాగం ఫిబ్రవరి 2025లో రైల్వే అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్టుల మొదటి వార్షిక సదస్సును విజయవంతంగా నిర్వహించింది.

– ఈ జోన్ తన ఉద్యోగులకు సౌకర్యాలు మరియు వారి సంక్షేమాన్ని మరింత మెరుగుపరచడానికి ఎల్లప్పుడూ ముందుంటుంది. ఈ దిశలో భాగంగా మార్చి-2025లో రైల్వే లబ్ధిదారుల ప్రయోజనం కోసం సికింద్రాబాద్‌లోని లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్‌లో 64 స్లైసెస్ సిటి స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేయడమైనది.

– భారతీయ రైల్వేలు రైల్వే స్టేషన్లలో సౌకర్యాలను మరియు వసతులను మెరుగుపరచడానికి మరియు స్టేషన్ భవనాలను ఆకర్షణీయంగా మార్చడానికి , స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా అభివృద్ధి చేస్తున్నాయి. దీనిలో భాగంగా, తెలంగాణలోని బేగంపేట, కరీంనగర్ మరియు వరంగల్ అనే మూడు ముఖ్యమైన రైల్వే స్టేషన్లను అమృత్ స్టేషన్లుగా పునరాభివృద్ధి చేసి, గౌరవ ప్రధానమంత్రి గారు మే 2025లో రిమోట్ వీడియో లింక్ ద్వారా ప్రారంభించారు.

– భారతీయ రైల్వేలు సాధారణంగా మరియు ప్రత్యేకంగా దక్షిణ మధ్య రైల్వే పర్యాటక స్నేహపూర్వక కార్యక్రమాలను చేపట్టడంలో ముందున్నాయి. దానిలో భాగంగా, ఇండో-సార్సెనిక్/ఇండో-గోతిక్ వాస్తుశిల్పాన్ని మరియు దాని గొప్ప వారసత్వాన్ని సరైన కాంతివిధానంతో చాటి చెప్పడానికి రూ. 2.2 కోట్ల వ్యయంతో కాచిగూడ హెరిటేజ్ స్టేషన్‌కు వాస్తుశిల్ప సుందరీకరణతో విద్యుత్ దీపాలంకరణ పూర్తిచేసి దానిని గౌరవ కేంద్ర మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి జూన్ 2025లో దేశానికి అంకితం చేశారు.

– ఇంకా, జూన్ 2025లో, రైల్వే లబ్ధిదారుల ప్రయోజనం కోసం సికింద్రాబాద్‌లోని లాలాగూడ సెంట్రల్ హాస్పిటల్‌లో అంతర్గత కార్డియాక్ క్యాథ్‌ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు.

– గౌరవ రైల్వే కేంద్ర మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ జూలై 2025లో కాచిగూడ మరియు భగత్ కీ కోటి మధ్య నూతన రోజువారీ రైలును ప్రవేశపెట్టి జెండా ఊపి ప్రారంభించారు.

–మార్గమధ్యంలో రైలు ఆలస్యాలను తగ్గించడానికి మరియు ప్రయాణ సమయాన్ని ఆదా చేయడానికి జూలై, 2025లో పెద్దపల్లి జంక్షన్ వద్ద ఒక కీలకమైన బైపాస్ లైన్ ప్రారంభించబడింది.

–మహారాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ ఆగస్టు, 2025లో సి.ఎస్. టి.ఎం మరియు జాల్నా మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నాందేడ్ వరకు పొడిగించి, జెండా ఊపి ప్రారంభించారు.

– రైల్వే శాఖ గౌరవ కేంద్ర సహాయ మంత్రి శ్రీ వి. సోమన్న డిసెంబర్, 2025లో తిరుపతి మరియు సాయినగర్ షిర్డీ మధ్య నూతన వీక్లీ రైలును ప్రవేశపెట్టి, రిమోట్ వీడియో లింక్ ద్వారా జెండా ఊపి ప్రారంభించారు.

–డిసెంబర్, 2025లో కేంద్ర భారీ పరిశ్రమలు మరియు ఉక్కు శాఖ ల గౌరవ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మగారు చెన్నై సెంట్రల్ నుండి విజయవాడ మధ్య నడుస్తున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను నరసాపురం వరకు పొడిగించి, జెండా ఊపి ప్రారంభించారు.

2025 సంవత్సరంలో జోన్ చేపట్టిన పైన పేర్కొన్న విజయవంతమైన కార్యక్రమాలతో పాటు, ఈ క్రింది తెలియజేయబడిన ప్రధాన మౌలిక సదుపాయాలు, సామర్థ్య పెంపుదల ప్రాజెక్టులు, రాబడి సృష్టి మరియు ఇతర ముఖ్యమైన పనులు కూడా ఉన్నాయి :

– దక్షిణ మధ్య రైల్వే జనవరి నుండి నవంబర్, 2025 వరకు ఈ క్రింది వాటిని సాధించింది:

– సరుకు రవాణాలో 136.2 మిలియన్ టన్నులు(జనవరి - నవంబర్ 24లో 128.4 మిలియన్ టన్నులతో పోలిస్తే).

– సరుకు రవాణా ఆదాయం లో రూ. 12841 కోట్లు(జనవరి - నవంబర్ 24లో రూ. 12597 కోట్లతో పోలిస్తే)

– ప్రయాణీకుల ఆదాయంలో రూ. 5525 కోట్లు ( సరుకు రవాణా ఆదాయంజనవరి - నవంబర్ 24లో రూ. 5261 కోట్లతో పోలిస్తే)

–రూ. 19314 కోట్ల స్థూల మొత్తం ఆదాయం (జనవరి - నవంబర్ 24లో రూ. 18831 కోట్లతో పోలిస్తే)

– దక్షిణ మధ్య రైల్వే 2025 సంవత్సరంలో 52 స్టేషన్లు/సేవా భవనాలకు అత్యధిక శూన్య/శూన్య ప్లస్ లేబులింగ్‌ను సాధించింది . ఈ స్టేషన్లు/సేవా భవనాలలో నికర ఇంధన దిగుమతికి సమానంగా లేదా అంతకంటే ఎక్కువ నికర ఇంధన ఎగుమతిని సాధించినందుకు భారతీయ రైల్వేలలో ఇది అత్యధికం.

–2025 సంవత్సరంలో మూడు గతి శక్తి కార్గో టెర్మినల్స్ ప్రారంభించబడ్డాయి.

– గుంతకల్లు డివిజన్‌లోని సంజమల వద్ద మెస్సర్స్ రామ్కో సిమెంట్స్

– గుంతకల్లు డివిజన్‌లోని యెర్పేడు వద్ద మెస్సర్స్ జగదీష్ మరియు ఇతరులు

–గుంటూరు డివిజన్‌లోని జనపహాడ్ వద్ద మెస్సర్స్ డెక్కన్ సిమెంట్స్

– 68 మ్యాన్డ్ లెవల్ క్రాసింగ్ గేట్లను తొలగించారు.

– 22 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు మరియు 60 రోడ్ అండర్ బ్రిడ్జిలు నిర్మించబడ్డాయి.

– దక్షిణమధ్య రైల్వే ద్వారా 2025 లో 199 కి.మీ.ల ట్రాక్ జోడింపు (15 కి.మీ. కొత్త లైన్లు, 40 కి.మీ. డబుల్ లైన్ మరియు 144 కి.మీ. మూడవ లైన్)

– వాడి వద్ద 24 కి.మీ. పొడవునా విద్యుదీకరణతో పాటు (12 కి.మీ. డబుల్ లైన్) బైపాస్ లైన్‌ను ప్రారంభించారు. దీనివలన వాడి జంక్షన్‌కు వెళ్లకుండా రైళ్లను సజావుగా నడపడానికి సహాయపడుతుంది.

– దక్షిణ మధ్య రైల్వే 2025లో 184 ట్రాక్ కి.మీ. విద్యుదీకరించింది (డబ్లింగ్‌లో భాగంగా 40 కి.మీ. మరియు మూడవ లైన్‌లో భాగంగా 144 కి.మీ.). అదనంగా, హైదరాబాద్ డివిజన్‌లోని అక్కన పేట్ - మెదక్ సెక్షన్ మధ్య 17 రూట్ కి.మీ మరియు కలబురగి - ఖానాపూర్ సెక్షన్ మధ్య 97 రూట్ కి.మీ కూడా విద్యుదీకరించబడ్డాయి. దీనితో దక్షిణ మధ్య రైల్వేలోని సికింద్రాబాద్ డివిజన్‌లో 100 శాతం విద్యుదీకరణను సూచిస్తుంది.

– వివిధ విభాగాలలో 529 కిలోమీటర్ల మేర ఆటోమేటిక్ బ్లాక్ సిగ్నలింగ్‌ను విజయవంతంగా ప్రారంభించారు తద్వారా లైన్ సామర్థ్యాన్ని పెంచడానికి మరియు ఎక్కువ సంఖ్యలో రైళ్ల నిర్వహణకు సహాయపడింది.

– జోన్ సెక్షన్ సామర్థ్యాన్ని మరియు రైళ్ల సజావుగా నిర్వహణను పెంచడానికి వివిధ విభాగాలలో తొమ్మిది ఇంటర్మీడియట్ బ్లాక్ సిగ్నలింగ్ వ్యవస్థలను ప్రారంభించింది.

– దక్షిణ మధ్య రైల్వే 2025 సంవత్సరానికి గాను నాలుగు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులను గెలుచుకుంది - గుంతకల్లు లోని డీజిల్ ట్రాక్షన్ శిక్షణా కేంద్రం ఉత్తమ పనితీరు గల యూనిట్ అవార్డును పొందగా, రాయచూర్, కాచిగూడ మరియు లింగంపల్లి మొదలైన 3 రైల్వే స్టేషన్లు మెరిట్ సర్టిఫికేట్‌ను పొందాయి.

# ఐక్యతతోనే రజకుల భవిష్యత్తు

## -ఘనంగా రజక ఆత్మీయ సమ్మేళనం

## -ఆర్టీవో ఎంవిఐ సంగం వెంకట పుల్లయ్య



మణుగూరు, డిసెంబర్ 28 (భారతశక్తి): రజక కులస్తులు ఐక్యంగా ముందుకు సాగుతూ అన్ని రంగాల్లో రాణించాలని భద్రాచలం మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎం.వి.ఐ) సంగం వెంకట పుల్లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని తోగ్గుడెం గ్రామంలో గల శ్రీ సమ్మక్క?సారక్క ఆలయం వద్ద మణుగూరు మండల రజక కుటుంబాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రజక ఆత్మీయ సమ్మేళనం (వన భోజనాలు) కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందు పీవీ కాలనీ క్రాస్ రోడ్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, రజకులు విద్య, ఉద్యోగాలు, వ్యాపార రంగాల్లో మరింత ముందుకు రావాలని, ప్రతి ఏడాది ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తూ పరస్పర కష్టసుఖాలను పంచుకోవాలని సూచించారు. సమ్మేళనంలో నిర్వహించిన మిమిక్రీ, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. మీడియా మిత్రులను ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. రజకుల ఐక్యతను సమాజానికి చాటి చెప్పడంలో మీడియా పాత్ర అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో

చిటికెన భాస్కర్, పున్నం భిక్షపతి, వల్లంకొండ అప్పయ్య, పున్నం ఉమామహేశ్వరరావు, తనకం ముజాకర్, పొనగంటి కృష్ణ, రాపర్తి శ్రీహరి, అక్కినపల్లి సత్యనారాయణ, సట్టు యాకయ్య, పొన్నా కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

## టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి భారత శక్తి ప్రతినిధి డిసెంబర్ 29

కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత బిజెపికి లేదని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ 140 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు నిర్మల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ శ్రేణుల సమక్షంలో జాతీయ జెండాను ఆవిష్కరించి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... దేశ స్వాతంత్రం కోసం ఎంతోమంది కాంగ్రెస్ నాయకులు తమ ఆస్తులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అర్పించారని



గుర్తు చేశారు. 140 ఏళ్ల చరిత్ర కలిగిన గొప్ప పార్టీ అన్నారు. కాంగ్రెస్ పార్టీని విమర్శించే అర్హత బీజేపీకి లేదన్నారు. బిజెపి పార్టీ సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారాలకు పాల్పడుతుందన్నారు. ఫోటోలు మార్ఫింగ్ చేసి యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. యువత వారి కుట్రను గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఆంజనేయులు సి డి సి రామ్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుగౌడ్ ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు సదాశివపేట మండల అధ్యక్షులు సిద్ధన్న పట్టణ అధ్యక్షుడు జార్జ్ నాయకులు బుచ్చి రాములు నర్సింహారెడ్డి సంతోష్ కిరణ్ గౌడ్ మహేష్ శ్రీకాంత్ గౌడ్ బలవంత్ రెడ్డి అనిల్ చారి కార్యకర్తలు పాల్గొన్నారు.

# సినిమా




## 2026: కొత్త ఏడాదిలో పలకరించే మొదటి సినిమాలివే!


శ్రీ నందు హీరోగా నటిస్తూ.. స్వయంగా నిర్మిస్తోన్న చిత్రం 'సైక్ సిద్ధార్థ'. వరుణ్ రెడ్డి దర్శకుడు. యామిని భాస్కర్ కథానాయిక. తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 12న రావాల్సి ఉంది. అయితే, 'అఖండ2' కారణంగా వాయిదా పడి, కొత్త ఏడాదిలో ప్రేక్షకుల పలకరించడానికి వస్తోంది. జనవరి 1న ఈ చిత్రం విడుదల కానుంది. సమాజానికి, యువతకు కనెక్ట్ అయ్యే కథాంశంతో సినిమాను తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.




''మహాగాయకుడు ఘంటసాల గురించి ఈతరానికి తెలియాలనే తపనతో ఎంతో కష్టపడి తీసిన సినిమా 'ఘంటసాల ది గ్రేట్'' అంటున్నారు దర్శకుడు సి.హెచ్.రామారావు. ఆయన దర్శకత్వంలో కృష్ణచైతన్య టైటిల్ పాత్ర పోషించిన చిత్రమిది. మృదుల, సుమన్, సాయికిరణ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. జనవరి 2న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది.




రామ్ కిరణ్, మేఘ ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సఃకుటుంబానాం'. హెచ్.మహదేవ గౌడ్ నిర్మాత. రాజేంద్ర ప్రసాద్, బ్రహ్మానందం, సత్య తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీ కూడా తొలుత అనుకున్న షెడ్యూల్ ప్రకారం డిసెంబరు 19న రావాల్సి ఉంది. ఇప్పుడు కొత్త ఏడాదిలో జనవరి 1న థియేటర్స్‌లో విడుదల కానుంది. అందరూ మెచ్చే మంచి కుటుంబ కథాంశంతో రూపొందుతున్న చిత్రంగా దీన్ని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రాలు చూస్తే అర్థమవుతోంది.



అవినాశ్ తిరువీధుల హీరోగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'వనవీర'. పురాణాల టచ్‌తో సాగే గ్రామీణ నేపథ్య చిత్రంగా 'వానర' పేరుతో దీనిని విడుదల చేయాలని నిర్ణయించారు. అయితే, సెన్సార్ బోర్డు అభ్యంతరాల మేరకు దాన్ని 'వనవీర'గా మార్చారు. అవినాశ్ బుయానీ, ఆలపాటి రాజా, సి అంకిత్ రెడ్డి నిర్మించారు. సిమ్రాన్ చౌదరి కథానాయిక. జనవరి 1న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది.

## డియర్ జిందగీ



చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన చాలా తక్కువ సమయంలోనే యూత్‌లో మంచి క్రేజ్ సొంతం చేసుకున్న అందాల ముద్దుగుమ్మ భాగ్య శ్రీ బోర్సే. ఈ మధ్య ఎవరినోట విన్నా ఈ అమ్మడు పేరే వినిపిస్తుంది. అంతలా తన అందంతో అందరినీ మాయ చేసింది ఈ బ్యూటీ. మాస్ మహారాజ్ రవితేజ సరసన మిస్టర్ బచ్చన్ మూవీలో నటించి మంచి ఫేమ్ సంపాదించుకుంది. ఇందులో ఈ అమ్మడు నటన, గ్లామర్‌కు ప్రతి ఒక్కరూ ఫిదా అయిపోయారు. దీంతో ఆ మూవీ రిలీజైనప్పటి నుంచి యూత్ లేటెస్ట్ క్రష్ అయిపోయింది. దీంతో ఈ భామ.. వరుసగా ఆఫర్స్ అందుకుంటూ దూసుకెళ్తున్నట్లు టాక్ వినిపిస్తుంది. ఇక ఈ మధ్య విజయ్ దేవరకొండ సరసన కింగ్ డమ్ మూవీలో కనిపించి మెప్పించింది. ఇక సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ ఎప్పుడూ తన ఫొటోస్ షేర్ చేస్తూ కుర్రకారును మాయ చేస్తుంటుంది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు తాజాగా ఇన్‌స్టాలో పిక్స్‌పెట్టింది. 'డియర్ జిందగీ, 2025కి థాంక్యూ.. ఈ ఏడాదిలో చాలా నేర్చుకున్న. లవ్, నవ్వుతో నా మనస్సు నిండిపోయింది. అన్నిటికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. మిస్టర్ 2026.. కొత్త ఏడాదిలో అందరికీ మంచిగా ఉండాలి. నాకు ఒక మాట ఇవ్వు. లైఫ్‌లో ఎప్పటికీ నమ్మకం కోల్పో కూడదు. మనసులోని పిల్లాడిని ఎప్పటికీ బ్రతికించి ఉంచాలి. ఓటమిని చూసి నవ్వగలగాలి. ప్రతి తప్పును చిరునవ్వుతో స్వీకరించాలి. జీవితం అన్నది అన్నీ సరిగ్గా చేయడమే కాదు, చెప్పుకోదగ్గ ఒక అందమైన కథను సృష్టించుకోవడమే' అంటూ పోస్ట్ చేసింది.

## ఎర్రకోక పచ్చ రైక

చిన్నతనంలోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన కావ్య కల్యాణ్ రామ్.. చాలా మంది స్టార్ హీరోల సినిమాల్లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించి ఆకట్టుకుంది. పెద్దయ్యాక హీరోయిన్‌గా మారి తన లక్ ను టెస్ట్ చేసుకుంటుంది. 'మసూద'తో తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత బలగం చిత్రంతో ఒక్కసారిగా ఈ బ్యూటీ పేరు మారుమ్రోగింది. దాంతో కావ్య చాలా మంది ఫేవరెట్ హీరోయిన్‌గా మారిపోయింది. ఆతర్వాత శ్రీ సింహ నటించిన ఉస్తాద్ సినిమా డిజాస్టర్ అయ్యింది. అయితే కొద్దిరోజులుగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఈ అమ్మడు.. సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యుల ర్ గా ఫొటోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ ముద్దుగుమ్మ ఇన్ స్టాలో కొన్ని పిక్స్ షేర్ చేసింది. ఎర్ర చీర, ఆకుపచ్చ బ్లౌజ్‌తో ఎలాంటి హంగూ ఆర్భాటాలూ లేకుండా చాలా నేచురల్ లుక్ లో కనిపించి అందరినీ అట్రాక్ట్ చేస్తోంది. ఈఫొటోలకు 'నా సాయంత్రం ఫిల్టర్ కాఫీ కోసం సిద్ధం' అంటూ క్యాప్షన్ కూడా ఇచ్చింది. ఇక కావ్య షేర్ చేసిన ఈ ఫొటోలకు నెటిజన్లు లైకులు కొడుతూ.. నెట్టింట తెగ వైరల్ చేస్తున్నారు.



## ఫ్యాన్స్ నిరాశ



సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ నటించిన సికందర్ బాక్సాఫీస్ వద్ద భారీ డిజాస్టర్ గా నిలిచిన సంగతి తెలిసిందే. ఏ.ఆర్.మురుగదాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం విఫలమవ్వడం నిజంగా అతడిని నిరాశపరిచింది. ఆ నిరాశ నుంచి బయటపడేసే భారీ హిట్టు కోసం తపిస్తున్న సల్మాన్ బ్యాటిల్ ఆఫ్ గల్వాన్ చిత్రంతో గ్రేట్ కంబ్యాక్ ని ఆశిస్తున్నాడు. అపూర్వ లఖియా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, సాహసోపేతమైన ఇండో-చైనా బార్డర్ వార్ నేపథ్యంలో ఇది రూపొందుతోంది. ఈ సినిమా టీజర్ ఇటీవలే విడుదలైంది. అందులో సల్మాన్ ఒక నిరాయుధుడై శత్రు సైన్యంపై పోరాడటానికి సిద్ధమయ్యే సీన్ చూపించారు. కానీ అందులోని కంటెంట్ అభిమానులను అంతగా మెప్పించలేకపోయింది. చైనా సైన్యం ఆయుధాలు లేకపోయినా ముష్టి యుద్ధానికి అన్ని రకాల రక్షణలతో దూసుకొస్తుంటే.. సల్మాన్ మాత్రం చాలా సింపుల్ గా ఒక పుచ్చిపోయిన కర్ర పట్టుకుని నిలబడ్డాడు. ప్రతిఘటించేందుకు సిద్ధంగా లేనివాడిగా కనిపించాడు. ఇది ఫ్యాన్స్ ని నిరాశపరిచింది. దీంతో ట్రోలింగ్, మీమ్స్ తో విరుచుకుపడుతున్నారు.

## 'కానిస్టేబుల్ కనకం' సీజన్ 2 స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్.. సబ్‌స్క్రిప్షన్‌పై 'ఈటీవీ విన్' ఆఫర్



'ఈటీవీ విన్' ఒరిజినల్ వెబ్‌సిరీస్ 'కానిస్టేబుల్ కనకం' ఆగస్టులో విడుదలై, ప్రేక్షకులను విశేషంగా అలరించింది. దీంతో, ఈ సిరీస్ సీజన్ 2పై ఆసక్తి నెలకొంది. 'కానిస్టేబుల్ కనకం 2' ఎప్పుడొస్తుందా? అని ఎదురుచూసిన వారికి ఓటీటీ సంస్థ శుభవార్త చెప్పింది. స్ట్రీమింగ్ డేట్‌ను ఖరారు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపింది. 2026 జనవరి 8 నుంచి ఈ సిరీస్ సీజన్ 2 స్ట్రీమింగ్ అవుతుందని ప్రకటించింది. ఈ సందర్భంగా ఓ ఆఫర్ కూడా ఇచ్చింది.

**సిరీస్ కథాంశమిదీ..**

వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో ప్రశాంత్ కుమార్ దిమ్మెల తెరకెక్కించిన సిరీస్ 'కానిస్టేబుల్ కనకం'. కనక మహాలక్ష్మి అలియాస్ కనకం పాత్రలో వర్ష ఆకట్టుకున్నారు. కానిస్టేబుల్‌గా పని చేసేందుకు కనకం ఓ ఊరికి వెళుతున్న సమయంలో ఆమెకు చంద్రిక (మేఘ లేఖ) పరిచయం అవుతుంది. ఇద్దరూ స్నేహితులవుతారు. ఒక రోజు కనకం, చంద్రిక కలిసి బండిపై వెళుతుండగా ప్రమాదం జరుగుతుంది. ఆ క్షణం నుంచి చంద్రిక కన్పించకుండా పోతుంది. ఇంతకీ చంద్రిక ఏమైంది? అడవిగుట్టలో దాగిన మర్మం ఏంటి? అక్కడకు వెళ్లిన మహిళలు ఏమవుతున్నారు? కానిస్టేబుల్ కనకం ఈ మిస్టరీని ఎలా ఛేదించింది? అన్నది సిరీస్ కథాంశం. చంద్రిక ఎక్కడుంది అన్నది సీజన్ 2లో కీలకం.

**సబ్‌స్క్రిప్షన్ ఆఫర్**

'ఈటీవీ విన్' నెలవారీ సబ్‌స్క్రిప్షన్ తీసుకునే వారు 'WIN50' కోడ్ ఉపయోగించి ₹ 50 రాయితీ పొందవచ్చని, 'WIN100' కోడ్ ఉపయోగించి వార్షిక చందాదారులు రూ.100 రాయితీ పొందవచ్చని సంస్థ ప్రకటించింది.



# పరిశోధనలతో.. ధైర్యమిచ్చారు!

**కళ్లు తెరిచి ఎవరైనా చూస్తారు... కళ్లు మూసుకుని కూడా చూడగలరా? నయం కావడానికి వారం రోజులు పడుతుందనుకున్న గాయం నాలుగ్గంటల్లో తగ్గిపోతే ఎలా ఉంటుంది? ఇవి నిజం కావాలంటే ఏ మ్యాజిక్కో రావాలి, లేదంటే ఏ కనికట్టు విద్యో తెలియాలి అనుకుంటే పొరపాటు. ఇవన్నీ ఈ ఏడాది శాస్త్రవేత్తలు సాధించిన విజయాలు, అక్షరాలా వాస్తవాలు... అవేంటో తెలుసుకుందాం.**

**చీకటినీ జయించారు...**

కళ్లు తెరిచి ఎవరైనా చూడగలరు... కానీ, కళ్లు మూసుకుని చూడగలరా? అదేమంత కష్టం కాదంటూ.... కళ్లు మూసుకుని చీకట్లోనూ చూడగల సూపర్ విజన్ లెన్స్‌ని తయారుచేశారు చైనా శాస్త్రవేత్తలు. రేర్‌ఎర్త్‌మెటల్స్‌తో తయారైన నానోపార్టికల్స్‌ని వాడి శాస్త్రవేత్తలు ఈ సూపర్‌విజన్ కాంటాక్ట్ లెన్స్‌ని తయారుచేశారు. ఈ లెన్స్ పెట్టుకుంటే చిమ్మచీకట్లో కూడా ఏం జరుగుతుందో చూడొచ్చు. దట్టమైన పొగమంచు ఉన్న చోటా, యుద్ధ క్షేత్రాల్లోనూ వాడేందుకు వీటిని తయారుచేశారట.

**సింథటిక్ బ్లడ్...**




'మా బంధువుల్లో ఒకాయనకి గుండె ఆపరేషన్ చేస్తున్నారు. అర్జెంట్‌గా ఓ పాజిటివ్ రక్తం కావాలి'... ఇలాంటి మెసేజ్‌లని సోషల్‌మీడియా గ్రూపుల్లో, వాట్సప్ స్టేటసుల్లో చూస్తూనే ఉంటాం. కానీ, ఇకనుంచీ ఇలా ఫలానా గ్రూప్ రక్తం కావాలని కంగారు పడాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఎందుకంటే జపాన్ శాస్త్రవేత్తలు 'వైరస్ ఫ్రీ సింథటిక్ బ్లడ్'ని ఆవిష్కరించారు. ఈ బ్లడ్ గ్రూప్ ఎవరికైనా మ్యాచ్ అవుతుంది. వైరస్‌లు సోకుతాయన్న బాధాలేదు. రెండేళ్ల వరకూ నిల్వ ఉంటుంది. సమయానికి రక్తం అందక చనిపోతున్న లక్షలమందికి ఇది సంజీవనికానుంది.

**నువ్వు గింజంత పేస్‌మేకర్...**



పుట్టుకతోనే గుండెజబ్బులు ఉన్న పిల్లలకు శస్త్రచికిత్సలో భాగంగా ఒక పేస్‌మేకర్‌ని వాళ్ల గుండెలో అమర్చాల్సి ఉంటుంది. చుట్టూ వైర్లూ, కోతలతో పిల్లలు బాగా ఇబ్బందిపడిపోతారు, ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం కూడా ఉంది. ఆ బాధంతా లేకుండా నువ్వుగింజ పరిమాణంలో ఉండే పేస్‌మేకర్‌ని అమెరికా శాస్త్రవేత్తలు తయారుచేశారు. ఇంజెక్షన్‌తో దీన్ని గుండె దగ్గరకు చేరుస్తారు, శరీరం చుట్టూ వైర్లూ అవీ పెట్టకుండానే దానంతట అదే పనిచేస్తుంది.

**నాలుగ్గంటల్లో నయం**



శరీరానికి గాయం అయితే నయం కావడానికి ఎంత సమయం పడుతుంది? ఎంతలేదన్నా... ఒక్క రోజన్నా పడుతుంది కదా! కానీ నాలుగ్గంటల్లోనే నయం చేసే సూపర్‌స్కిన్‌ని తయారు చేశారు ఫిన్‌ల్యాండ్ శాస్త్రవేత్తలు. సన్నని నానోషీట్లూ, హైడ్రోజెల్ మెటీరియల్‌తో తయారుచేసిన ఈ కృత్రిమ చర్మం ఒక్క మిల్లీమీటర్ మందం మాత్రమే ఉంటుంది. దీన్ని గాయాలపైన ఉంచినప్పుడు చర్మంలో పూర్తిగా కలిసి పోయి, దీనిలోని ఔషధాలని శరీరంలోకి పంపి, కేవలం నాలుగ్గంటల్లోనే ఆ గాయాన్ని మానేలా చేస్తుందట.

**బోన్ 02**



పడిపోయో, మరో కారణంతోనో ఎముక విరిగిపోతే ఇక ఆ తర్వాత జరిగే శస్త్రచికిత్స ఎంత బాధాకరంగా ఉంటుందో చెప్పాల్సిన పని లేదు. ప్లేట్లు వేయడం, స్క్రూలు బిగించడం... ఈ క్రమంలో ఇన్‌ఫెక్షన్లు కూడా రావొచ్చు. ఇంత తతంగం లేకుండా కేవలం మూడంటే మూడు నిమిషాల్లో విరిగిన ఎముకని అతికించేస్తే ఎలా ఉంటుంది? అవును, చైనా శాస్త్రవేత్తలు 'బోన్ 02' అనే ప్రత్యేకమైన జిగురుని కనిపెట్టారు. ఎముక విరిగిన చోట దీన్ని ఇంజెక్షన్ ద్వారా ఎక్కించి నిమిషాల్లో అతికించేయొచ్చు. సముద్రంలోని బండరాళ్లకు బలంగా అతుక్కునే ఆల్చిప్పల స్ఫూర్తితో ఈ జిగురుని తయారుచేశారు.

**డౌన్‌సిండ్రోమ్ రాకుండా...**

డౌన్‌సిండ్రోమ్ ఉన్న పిల్లల్లో శారీరకంగా, మానసికంగా ఎదుగుదలలోపం ఉంటుంది. ట్రైసోమీ 21 అనే అదనపు క్రోమోజోమే ఇందుకు కారణం. ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్లమంది పిల్లలు ఈ సమస్యతో బాధపడుతున్నారు. జపాన్ శాస్త్రవేత్తలు క్రిస్పర్‌కాస్9 టెక్నాలజీ వాడి డౌన్‌సిండ్రోమ్ వ్యాధి ఉన్నవారి కణాల నుంచి వారికి ఇబ్బంది కలిగించే అదనపు క్రోమోజోమ్‌ని తొలగించారు. దాంతో కణాలు మందకొడిగా కాకుండా సాధారణంగా అందరిలానే పనిచేయడం గమనించారు. ఈ విజయం భవిష్యత్తులో డౌన్‌సిండ్రోమ్‌ని తల్లిగర్భంలో ఉండగానే అడ్డుకోవడానికి పనికొస్తుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

**ఎనామిల్ పొర తిరిగి వచ్చేలా**

మన దంతాలపైన ఎనామిల్ అనే రక్షణపొర ఉంటుంది... ఇది ఒక్కసారి పోయిందంటే తిరిగి రాదు. దాంతో దంతాలు పాడవడం, పుచ్చిపోవడం జరుగుతుంది. ఆపైన కృత్రిమ దంతాలని అమర్చుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. అలాకాకుండా మన దంతాలు సహజంగానే తిరిగి ఎనామిల్ పొరను ఏర్పరుచుకునేలా ప్రొటీన్ పేస్ట్‌ని తయారుచేశారు సింగపూర్ శాస్త్రవేత్తలు. ఈ పేస్ట్‌తో బ్రష్ చేసుకుంటే దీనిలోని కెరాటిన్ ప్రొటీన్ దంతాలపైన ఎనామిల్ పొరను సహజంగా ఏర్పరుస్తుంది. ఫలితంగా దంతాలు పాడవకుండా ఉంటాయి. ఈ పేస్ట్‌ని మన జుట్టులో ఉండే ప్రొటీన్‌తో తయారుచేశారట.



# డిసెంబరాలు.. ప్రకృతి అందాలై!

**కొన్ని పూలమొక్కల్ని చూసినప్పుడు వీటినెందుకు పెంచాలి అనిపించడం సహజం. వాసన ఉండవు. అందంగానూ కనిపించవు. ఆ కోవకే చెందుతాయి గంటాకారంలోని డిసెంబర్ పూలు.**









మూడు నాలుగు దశాబ్దాల క్రితంనాటి అమ్మాయిలకు ఇవి సుపరిచితమే. కంచెల్లోనూ రోడ్లపక్కనా ఎక్కడంటే అక్కడ పెరిగే డిసెంబరాల్నీ, పసుపు పచ్చని ముళ్లగోరింటల్నీ కోసి మాలలు కట్టి ఇష్టంగా పెట్టుకునేవారు. ఏ వాసనా లేకున్నా ఆ రంగులు ఆకర్షణీయంగా కనిపించటం, పైగా తేలికగా ఉండటంతో ఎంత పెద్ద మాలనైనా జడలో ఇట్టే తురిమేసేవారు. ముఖ్యంగా డిసెంబర్, జనవరి నెలల్లో ఇవి ఎక్కువగా పూస్తాయి. అందుకే డిసెంబర్ పూలుగా ఇవి వాడుకలోకి వచ్చి ఉండొచ్చు. వీటిల్లో నీలం, ఊదా, తెలుపు, గులాబీ, ఎరుపు... ఇలా రంగులూ రకాలూ చాలానే ఉన్నాయి. అలాంటి రకాల్లో ఒకటి ముళ్లగోరింట. దీన్నే వజ్రదంతి అనీ పిలుస్తారు. అయితే ఇంతకీ వీటిని ఎందుకు పెంచాలన్నదేగా సందేహం. సృష్టిలోని ప్రతి మొక్కకీ ఓ ప్రయోజనం ఉంటుందని తెలిసిందేగా. అలాగే డిసెంబరాలకీ ఓ ప్రత్యేకత ఉంది. ఈ కాలంలో చెట్టునిండా విరబూసిన పూలల్లోని తేనె, ఆ పూల రంగులూ పిట్టల్నీ సీతాకోకచిలుకల్నీ ఆకర్షిస్తాయి. అంటే, పరాగ సంపర్కానికి తోడ్పడుతూ జీవవైవిధ్యానికి దోహదం చేస్తాయి. పైగా దటమైన పొదల్లా పెరిగే ఈ మొక్కల కొమ్మల మధ్యలో బుల్లి పిట్టలూ కీటకాలూ గూళ్లు కట్టుకుంటాయి. అలాగే ఈ మొక్కల ఆకుల్నీ వేర్లనీ జ్వరం, శ్వాస సమస్యల నివారణకు సంప్రదాయ చికిత్సల్లో వాడుతుంటారు. అందుకే ఎలాంటి వాసనా లేకున్నా అందమైన ఆకారంలో మురిపించకున్నా ఆ పూల రంగులు ప్రకృతి అందాలై విరబూస్తుంటాయి. మరి మన ఇంటితోటలో వీటికీ చోటిద్దామా?!







# ఏపీలో కొత్త కూటమికి స్పేస్ ఉందా

విశాఖపట్టణం , డిసెంబర్ 29,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల గురించి రాష్ట్ర ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలో మూడు ప్రధాన ప్రాంతీయ పార్టీలు కీలకంగా ఉన్నాయి. వాటిలో సీనియర్ పార్టీగా తెలుగుదేశం పార్టీ కొనసాగుతుండగా, రెండో స్థానంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీఉంది. ఇక 2024 ఎన్నికల తర్వాత జనసేన పార్టీ కూడా అధికార కూటమిలో భాగంగా మూడవ ప్రాంతీయ శక్తిగా నిలిచింది. జాతీయ పార్టీలుగా కాంగ్రెస్, బీజేపీ ఉన్నప్పటికీ, వాటిలో బీజేపీ మాత్రమే కూటమి రాజకీయాలతో ప్రభావం చూపుతోంది. కమ్యూనిస్టు పార్టీలు కూడా ఉన్నా, పెద్దగా రాజకీయ ప్రభావం చూపించలేకపోతున్నాయి.ఈ పరిస్థితుల్లో ఏపీలో మరో కొత్త ప్రాంతీయ పార్టీకి అవకాశం ఉందా అనే ప్రశ్న మళ్లీ తెరపైకి వచ్చింది. కొత్త పార్టీలు ఏర్పడినా, వాటిని ఆదరించే రాజకీయ ఖాళీ నిజంగా ఉందా అనే చర్చ కూడా కొనసాగుతోంది. గత నాలుగు నుంచి ఐదు దశాబ్దాల రాజకీయ చరిత్రను పరిశీలిస్తే, ఏపీలో ఎక్కువగా రెండు పార్టీల మధ్యే పోటీ నడుస్తూ వచ్చింది.ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీటీడీపీ మధ్య పోరు ఎన్నో ఏళ్లపాటు కొనసాగింది. రాష్ట్ర విభజన తర్వాత అదే పోరు టీడీపీ వర్సెస్ వైసీపీగా మారింది. జనసేన మూడవ పార్టీగా రంగప్రవేశం చేసినా, కావాల్సినంత రాజకీయ స్థలం లేదని భావించి కూటమిలో భాగమై అధికారంలో కొనసాగుతోందన్న అభిప్రాయం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త రాజకీయ ప్రయోగాలు ఎంతవరకు ఫలిస్తాయన్నది రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీస్తోంది.పార్టీ పెట్టడం సులువే అయినా, దానికి సరైన స్పేస్ ఉందా లేదా అన్నది ముఖ్యమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు ఆసక్తి రేపాయి. బీసీలు, మైనారిటీలు, ఎస్సీ, ఎస్టీ, కాపులు కలిసి ఒక బలమైన రాజకీయ వేదిక ఏర్పడుతుందని ఆయన చెప్పారు. ఈ వ్యాఖ్యల తర్వాత రంగానాడు పేరుతో విశాఖపట్నంలో వంగవీటి రంగా వర్ధంతి సందర్భంగా నిర్వహించిన భారీ సభ మరింత చర్చకు కారణమైంది.ఈ సభకు రంగా కుమార్తె ఆశాకిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె రాజకీయ పార్టీ ఏర్పాటు గురించి స్పష్టంగా చెప్పకపోయినా, రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి రంగా ఆశయాల కోసం పోరాడతానని ప్రకటించారు. ఆమె తన ప్రసంగంలో టీడీపీ, జనసేన, వైసీపీపై విమర్శలు చేయడంతో, ఆమె భవిష్యత్ రాజకీయ అడుగులపై ఊహాగానాలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఆమె వైసీపీలో చేరుతారన్న వార్తలపై ఈ ప్రసంగం ఒక రకమైన సమాధానంగా మారింది.ఇదే సభకు నిర్వహణ బాధ్యతలు తీసుకున్న రాధా రంగా మిత్రమండలినేతలు, తాము ఏపీలో ఒక బలమైన రాజకీయ శక్తిగా అవతరిస్తామని ప్రకటించడంతో కొత్త చర్చకు దారి తెరచింది. రాజకీయ శక్తి అంటే పార్టీనేనా? రంగానాడు ఒక రాజకీయ వేదికగా మారుతుందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొత్త పార్టీ వస్తే అదే పేరుతో ఏర్పడుతుందా అనే చర్చ కూడా సాగుతోంది.ఈ సభలో పాల్గొన్న తెలంగాణకు చెందిన బీసీ నేత, ఎంపీ ఆర్. కృష్ణయ్య కూడా బీసీలు, బడుగులు, కాపులు కలసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దీంతో బహుజన వర్గాల కోసం ఏపీలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పడుతుందా అన్న ఆసక్తి పెరిగింది. ఆశాకిరణ్ రాష్ట్ర పర్యటన పూర్తయ్యాక ఆమె ప్రసంగాలు, ఆలోచనలు చూసిన తర్వాతే ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

చీలిక కోసం ఆరాటం

2014 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీవిజయం సాధించింది.. అయితే తెరపైకి కాపు రిజర్వేషన్ ఉద్యమం వచ్చింది. ఎన్నికల్లో భాగంగా కాపులను బీసీల్లో చేరుస్తామని హామీ ఇచ్చినందున అమలు చేయాల్సిందేనని కాపు రిజర్వేషన్ ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభం డిమాండ్ చేశారు. అప్పట్లో ఉద్యమం పతాక స్థాయికి చేరింది. ఈ క్రమంలోనే తునిలో రైలు విధ్వంసం ఘటన చోటుచేసుకుంది. 2015లో ఈ ఘటన జరిగింది. అయితే అప్పట్లో ఈ ఘటన వెనుక వైసీపీ హస్తం ఉందని ఆరోపణలు వచ్చాయి. సాక్షాత్ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సంచలన ఆరోపణలు చేశారు. దీని వెనుక వైసిపి గుండాలు ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ఘటనతో కాపు సామాజిక వర్గంలో చేంజ్ కనిపించింది. అప్పటి తెలుగుదేశం పార్టీకి దూరమయ్యారు కాపులు. కాపుల్లో టిడిపి ప్రభుత్వం పట్ల అసంతృప్తి మొదలు కావడానికి తుని విధ్వంస ఘటన ఒకటి కారణం.ఇప్పుడు రంగా సేన ద్వారా కాపులు రాజకీయంగా యాక్టివ్ కావాలని భావిస్తున్నారు. అదే విషయాన్ని వైసిపి అనుకూల మీడియా హైలైట్ చేస్తోంది. తద్వారా కాపు సామాజిక వర్గంలో చీలికను ఆశిస్తున్నట్టు కనిపిస్తోంది. విశాఖలో ఈరోజు జరుగుతున్న భారీ బహిరంగ సభకు ఎక్కువమంది వైసిపి సానుభూతిపరులే వెళ్తుండటం కొత్త చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దిగి కాపులను సమీకరించినట్లు ప్రచారం సాగుతోంది. త్వరలో వంగవీటి ఆశా కిరణ్ సైతం వైసీపీలో చేరుతారని ఒక ప్రచారం ఉంది. కూటమిలో కాపులు దూకుడుగా ఉన్నారు . దానికి కళ్లెం వేయాలని చూస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే కాపు సేన ద్వారా ప్రయత్నాలు చేస్తోందన్న టాక్ ఉంది. అప్పట్లో తుని రైలు విధ్వంసం మాదిరిగానే.. ఈ సభతో టిడిపి పట్ల కాపుల్లో వ్యతిరేకత ప్రారంభమవుతుందని ఆశిస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# రోడెక్కిన సిక్కోలు రాజకీయం



శ్రీకాకుళం, డిసెంబర్ 29,

ప్రశాంతతకు మారుపేరుగా నిలిచే శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఎన్నికల ఫలితాల తర్వాత స్తబ్దుగా మారిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఇప్పుడు నడిరోడ్డుపై పడ్డాయి. ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్, పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మధ్య చెలరేగిన మాటల యుద్ధం.. ఇప్పుడు హత్యకు కుట్ర అనే తీవ్ర ఆరోపణల వరకు వెళ్లడం జిల్లావ్యాప్తంగా కలకలం రేపుతోంది. వ్యక్తిగత దూషణలు, రాజకీయ ఆధిపత్య పోరు కలగలిసి జిల్లా వైసీపీలో నిప్పు రాజేశాయి. అర్ధరాత్రి టెక్కలి జాతీయ రహదారిపై జరిగిన సంఘటన జిల్లా రాజకీయాల్లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. తనను హత్య చేయడానికి కుట్ర జరుగుతోందన్న సమాచారంతో హైదరాబాద్ నుంచి ఆగమేఘాల మీద శ్రీకాకుళం చేరుకున్న దువ్వాడ శ్రీనివాస్.. నేరుగా హైవేపైకి వచ్చి సవాల్ విసిరారు. “నా హత్యకు స్కెచ్ వేశారు.. దమ్ముంటే ఇక్కడికే వచ్చి చంపండి,” అంటూ ఆయన చేసిన సవాల్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వ్యవహారం కేవలం రాజకీయ విమర్శల స్థాయిని దాటి, ప్రాణహాని ఉందని ఆరోపించే స్థాయికి చేరడం గమనార్హంఈ తాజా గొడవకు ప్రధాన కారణం ఒక ఫోన్ కాల్ అని తెలుస్తోంది. ధర్మాన కృష్ణదాస్‌కు అత్యంత సన్నిహితుడైన కింజరాపు అప్పన్న అనే వ్యక్తి.. దువ్వాడ శ్రీనివాస్ సన్నిహితురాలు దివ్వెల మాధురికి ఫోన్ చేసి బెదిరించినట్లు సమాచారం. దువ్వాడను అంతమొందించడానికి రంగం సిద్ధమైందని, ఈ కుట్ర వెనుక ధర్మాన వర్గం ఉందని ఆ కాల్ సారాంశంగా దువ్వాడ ఆరోపిస్తున్నారు. ఈ సమాచారం తెలిసిన వెంటనే తీవ్ర ఆగ్రహానికి గురైన దువ్వాడ, రాత్రికి రాత్రే రోడ్డెక్కి ధర్మాన సోదరులను టార్గెట్ చేశారుదువ్వాడ శ్రీనివాస్ ఆరోపణలు కేవలం కృష్ణదాస్‌కే పరిమితం కాలేదు. జిల్లాలో చక్రం తిప్పుతున్న ధర్మాన సోదరులు కృష్ణదాస్, ప్రసాదరావు.. తనను రాజకీయంగా అణగదొక్కడమే కాకుండా, ఇప్పుడు భౌతికంగా లేకుండా చేయాలని చూస్తున్నారని దువ్వాడ మండిపడ్డారు. ఇప్పటికే తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయించడంలో వారి పాత్ర ఉందన్నది దువ్వాడ వాదన. “నన్ను పార్టీ నుంచి పూర్తిగా బహిష్కరిస్తేనే నాకు ఆనందం. అప్పుడు జిల్లాలో ఒక వర్గాన్ని అణచివేస్తున్న వీరిపై మరింత స్వేచ్ఛగా పోరాడగలను” అని దువ్వాడ వ్యాఖ్యానించడం.. ఆయన భవిష్యత్ కార్యాచరణనుక స్పష్టం చేస్తోంది. ధర్మాన సోదరుల ఆధిపత్యానికి గండి కొట్టాలన్నదే ఆయన ప్రధాన అజెండాగా కనిపిస్తోంది.మరోవైపు, ఈ ఆరోపణలను మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ తీవ్రంగా ఖండించారు. ఇదంతా దువ్వాడ ఆడుతున్న డ్రామాగా ఆయన అభివర్ణించారు. “దువ్వాడను చంపాల్సిన అవసరం నాకు ఏముంది? ఆయన చేస్తున్న ఆరోపణలు చూసి జనం నవ్వుకుంటున్నారు” అని కృష్ణదాస్ ఎద్దేవా చేశారు. కింజరాపు అప్పన్నతో తాను మాట్లాడింది నిజమే అయినా, దువ్వాడపై తనకు ఎలాంటి వ్యక్తిగత కక్ష లేదని స్పష్టం చేశారు. అనవసర రాద్ధాంతం చేసి సానుభూతి పొందాలన్నది దువ్వాడ ఎత్తుగడ అని ధర్మాన వర్గం వాదిస్తోంది.ఈ పరిణామాలను నిశితంగా పరిశీలిస్తే, ఇది కేవలం రాజకీయ వైరం మాత్రమే కాదని అర్థమవుతోంది. గత కొంతకాలంగా దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత జీవితం, దివ్వెల మాధురితో సహజీవనం, భార్య వాణితో విభేదాలు రచ్చకెక్కాయి. ఈ క్రమంలో పార్టీ అధిష్ఠానం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. అయితే, ఈ సస్పెన్షన్ వెనుక ధర్మాన సోదరుల హస్తం ఉందని దువ్వాడ బలంగా నమ్ముతున్నారు.ఎన్నికల్లో వైసీపీ ఓటమి తర్వాత జిల్లాలో కేడర్‌ను నడిపించే నాయకత్వం డీలా పడింది. ఈ సమయంలో సీనియర్ల మధ్య సమన్వయం లోపించడం, ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించాలనుకోవడం ఈ రచ్చకు కారణమైంది. శ్రీకాకుళం జిల్లాలో బలమైన కాళింగ సామాజిక వర్గానికి చెందిన ఈ ఇద్దరు నేతల మధ్య పోరు.. అంతిమంగా ఆ సామాజిక వర్గంలో చీలికకు దారితీసే ప్రమాదం ఉంది. పార్టీ నుంచి సస్పెండ్ అయ్యాక, తన ఉనికిని చాటుకోవడానికి దువ్వాడ దూకుడు పెంచారు. ధర్మాన వంటి సీనియర్‌ను ఢీకొట్టడం ద్వారా.. తాను ఎవరికీ భయపడననే సంకేతాన్ని కేడర్‌కు, ప్రజలకు ఇవ్వాలని ఆయన భావిస్తున్నట్లు కనిపిస్తోంది.శ్రీకాకుళం వైసీపీలో ముదురుతున్న ఈ ముసలం ఎటు దారి తీస్తుందోనన్న ఆందోళన కార్యకర్తల్లో నెలకొంది. అధికారం కోల్పోయిన సమయంలో నేతలు సంయమనం పాటించాల్సింది పోయి, ఇలా రోడ్లెక్కి సవాళ్లు విసురుకోవడం పార్టీకి మరింత నష్టం చేకూరుస్తుందన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అటు పోలీసులు కూడా ఈ వ్యవహారంపై దృష్టి సారించారు. హత్య కుట్ర ఆరోపణలు నిజమా? లేక రాజకీయ స్టంటేనా? అన్నది తేలాల్సి ఉంది. ఏది ఏమైనా, దువ్వాడ వర్సెస్ ధర్మాన ఎపిసోడ్ సిక్కోలు రాజకీయాల్లో ఇప్పట్లో చల్లారేలా లేదు.

# అన్నమయ్య జిల్లా..గాయబ్...

కడప, డిసెంబర్ 29,

ఆంధ్రప్రదేశ్ భౌగోళిక ముఖచిత్రం మరోసారి మారనుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాల పునర్విభజనపై ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా జిల్లాలను విభజించిందన్న విమర్శల నేపథ్యంలో, ప్రజాభీష్టం, పాలనా సౌలభ్యం ప్రాతిపదికన సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టింది. అయితే, ఈ ప్రక్రియలో అత్యంత






కీలకమైన, అనూహ్యమైన పరిణామం చోటుచేసుకుంది. అదే అన్నమయ్య జిల్లా రద్దు ప్రతిపాదన. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఈ మేరకు కీలక చర్చ జరిగింది.గత ప్రభుత్వం రాయచోటి కేంద్రంగా ఏర్పాటు చేసిన అన్నమయ్య జిల్లా భవిష్యత్తు ఇప్పుడు ప్రశ్నార్థకంలో పడింది. తాజా ప్రతిపాదనల ప్రకారం, అన్నమయ్య జిల్లాను మూడు ముక్కలు చేసి పొరుగు జిల్లాల్లో విలీనం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రాజంపేటను వైఎస్ఆర్ కడప జిల్లాలో కలపాలని ప్రతిపాదన సిద్ధమైంది. అలాగే అన్నమయ్య జిల్లా కేంద్రంగా ఉన్న రాయచోటిని కొత్తగా ఏర్పాటు కాబోయే మదనపల్లె జిల్లాలో విలీనం చేయనున్నారు. రైల్వే కోడూరును తిరుపతి జిల్లా పరిధిలోకి మార్చనున్నారు.ఈ మూడు ప్రధాన నియోజకవర్గాలను వేరే జిల్లాలకు తరలిస్తే, భౌగోళికంగా అన్నమయ్య జిల్లా ఉనికిని కోల్పోతుంది. రాయచోటి కేంద్రంగా పాలన సాగించడంపై గతంలోనే అనేక అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మదనపల్లె వంటి పెద్ద పట్టణాన్ని కాదని, రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంపై ప్రజల్లో అసంతృప్తి ఉంది. అదే సమయంలో రాజంపేట పార్లమెంటు కేంద్రంగా ఉన్నా కూడా దాన్ని కాదని రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంపై ఆ ప్రాంతవాసులు భగ్గుమంటున్నారు. పునర్విభజన నేపథ్యంలో వాళ్లంతా ఆందోళన చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తాజా నిర్ణయం దిశగా వెళ్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్రంలో కొత్తగా మదనపల్లె, పోలవరం, మార్కాపురం జిల్లాలను ఏర్పాటు చేస్తామని కూటమి ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతం ఉన్న 26 జిల్లాలకు ఈ మూడు కలిపితే మొత్తం సంఖ్య 29కి చేరాలి. కానీ, తాజా సమీక్షలో అన్నమయ్య జిల్లా రద్దు ప్రతిపాదన తెరపైకి రావడంతో, మొత్తం జిల్లాల సంఖ్య 28కే పరిమితం కానుంది. అంటే ఒక జిల్లా రద్దయి (అన్నమయ్య), మూడు కొత్త జిల్లాలు (మదనపల్లె, పోలవరం, మార్కాపురం) ఏర్పడితే నికరంగా పెరిగేది రెండు జిల్లాలు మాత్రమే. ఈ గణాంకాలతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తున్నట్లు సమాచారం.జిల్లాల పునర్విభజన కేవలం కొత్త జిల్లాల ఏర్పాటుకే పరిమితం కాలేదు. గత విభజనలో తలెత్తిన సరిహద్దు వివాదాలు, రెవెన్యూ డివిజన్ల సమస్యలను కూడా ఈసారి పరిష్కరించే ప్రయత్నం జరుగుతోంది. నెల్లూరు జిల్లాకు ఆనుకుని ఉన్న గూడూరును, గతంలో తిరుపతి జిల్లాలో కలిపారు. అయితే గూడూరు వాసులు నెల్లూరుతోనే తమకు ఎక్కువ అనుబంధం ఉందని, అక్కడికే మార్చాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. స్థానిక నేతల విజ్ఞప్తి మేరకు గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో కలిపేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. కొత్తగా ఏర్పడబోయే మార్కాపురం జిల్లా సరిహద్దులపైనా స్పష్టత వస్తోంది. దొనకొండ, కురిచేడు మండలాలను మార్కాపురం జిల్లాలో కలపాలని, అదే సమయంలో పొదిలిని ప్రకాశం జిల్లాలోనే ఉంచాలని చర్చ జరిగింది.ఈ తాజా పరిణామాలను విశ్లేషిస్తే రెండు ప్రధాన అంశాలు కనిపిస్తున్నాయి. రాయచోటి కంటే మదనపల్లె అన్ని విధాలా అభివృద్ధి చెందిన ప్రాంతం. చిత్తూరు జిల్లాలో మదనపల్లెకు ప్రత్యేక స్థానం ఉంది. దానిని జిల్లా కేంద్రం చేయడం ద్వారా ఆ ప్రాంత అభివృద్ధికి బాటలు వేయొచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే, రాజంపేట వాసులకు కడప జిల్లా కేంద్రం దగ్గరగా ఉండటం, రైల్వే కోడూరుకు తిరుపతితో ఉన్న సామీప్యతను పరిగణనలోకి తీసుకున్నారు. గత ప్రభుత్వం హడావుడిగా చేసిన విభజన వల్ల ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని చల్లార్చడం, తద్వారా ఆయా ప్రాంతాల్లో రాజకీయంగా పట్టు సాధించడం కూటమి ప్రభుత్వ వ్యూహంగా కనిపిస్తోంది.మొత్తానికి, ఏపీ జిల్లాల పునర్విభజన ప్రక్రియ క్లైమాక్స్ కు చేరుకుంది. అన్నమయ్య జిల్లా రద్దు నిర్ణయం ఆ ప్రాంత వాసుల్లో ఎలాంటి స్పందన రేకెత్తిస్తుందో, విపక్షాలు దీనిపై ఎలా స్పందిస్తాయో వేచి చూడాలి. కానీ, ఈ మార్పులు జరిగితే మాత్రం ఆంధ్రప్రదేశ్ మ్యాప్ లో మరోసారి భారీ మార్పులు చోటుచేసుకోవడం ఖాయం.

# రాష్ట్రంలో ఈ నెల 31వ తేదీ వరకు చలి తీవ్రత

హైదరాబాద్ డిసెంబర్ 28 రాష్ట్రం చలి గాలులతో గజగజ వణుకుతుంది. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండటంతో ప్రజలు బయటకు రా వాలంటేనే జంకుతున్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలకు తోడు చలి గాలులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 11 గంటలు అయినా చలి తీవ్రత తగ్గకపోవడం, మధ్యాహ్నం ఒక్కసారిగా ఎండవేడి వాతావరణం, సాయంత్రానికే మళ్లీ చలి ప్రారంభం కావడంతో చిన్నారులు, వృద్ధులు, మ హిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలో ఈ నెల 31వ తేదీ వరకు ఈ చలి తీవ్రతం కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఆ తర్వాత ఉష్ణోగ్రతలు పెరిగి చలి తగ్గుముఖం పడుతుందని అంచనా వేస్తున్నారు. జనవరి నెల ప్రారంభంలో సాధారణ శీతాకాలం ఉన్నా, సంక్రాంతికి మళ్లీ చలి పెరిగి, చివరి వారం నుంచి తగ్గుముఖం పడుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రాష్ట్రంలో క్రింది స్థాయి గాలులు ప్రధానంగా తూర్పు, ఆగ్నేయ దిశల నుండి వీస్తున్నాయి. దీంతో నాలుగైదు రోజులు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు 3 నుండి 4 డిగ్రీలు తక్కువ నమోదయ్యే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదివారం, సోమవారం రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలో శనివారం ఉదయం వరకు కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో 7.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా, సంగారెడ్డి 7.6, ఆదిలాబాద్ 8.8, రంగారెడ్డి 9.2, సిద్దిపేట 9.4, కామారెడ్డి 9.5, నిర్మల్ 10 డిగ్రీల ఉష్ణోగత్రల నమోదయింది. దీంతో పాటు ఆదివారం తొమ్మిది జిల్లాలకు వాతావరణ కేంద్ర ఆరంజ్ హెచ్చరికలు జారీ చేసింది.

# హైదరాబాద్‌ను చుట్టుముట్టిన వాయుకాలుష్యం

## 230 దాటి ప్రమాదకర స్థాయికి చేరిన గాలి నాణ్యత ప్రమాణం

హైదరాబాద్ డిసెంబర్ 28

హైదరాబాద్‌ను చుట్టుముట్టిన వాయుకాలుష్యం చలితో వణికిపోతున్న హైదరాబాద్ మహానరగరాన్ని మరోవైపు వాయు కాలుష్యం చుట్టుముట్టింది. చలి, పొగ మంచు కారణంగా వాయు కాలుష్యం పెరిగింది. శీతాకాలపు పొగమంచుకు తోడు వాహనాల ఉద్గారాలు, చెత్త దహనం వల్ల గాలిలో సూక్ష్మ ధూళికణాలు భారీగా పెరిగిపోతున్నాయి. అయితే ఉదయం సమయంలో వాయు కాలుష్యం ఎక్కువగా ఉంటుంది. హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలతో పాటు, పారిశ్రామిక ప్రాంతాలు, ఐటీ జోన్లు, రద్దీ ఎక్కువగా ఉండే రోడ్ల వెంట ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధికంగా ఉంటుంది. హైదరాబాద్‌లో గాలి నాణ్యత ప్రమాణం 230 దాటి ప్రమాదకర స్థాయికి చేరింది. గరిష్టంగా అమీన్‌పూర్ 289



పాయింట్లు, గచ్చిబౌలిలో 286, మాదాపూర్, విట్టల్‌రావు నగర్‌లో 230 పాయింట్లుగా నమోదైంది. నగరంలోని పలు ప్రాంతాలలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 200 పాయింట్లు దాటింది.

# ముగిసిన ఏపీ క్యాబినెట్ సమావేశం..

అమరావతి, డిసెంబర్ 28(భారతశక్తి ప్రతినిధి) :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో మొత్తం 24 అంశాలపై చర్చించి ఆమోదముద్ర వేసినట్లు మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలోని పలు జిల్లాల స్వరూపాన్ని మార్పులు, చేర్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ మార్పులన్నీ జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయని వివరించారు. సమావేశం అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ, ప్రజాభీష్టం మేరకే ఈ నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 17 జిల్లాల్లో మార్పులు జరిగాయని, 9 జిల్లాలను యథాతథంగా కొనసాగించనున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, యర్రగొండపాలెం ప్రాంతాలను కలిపి ఒక మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేసేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని వివరించారు. అలాగే, బనగానపల్లె, అడ్డరోడ్డును కొత్త రెవెన్యూ డివిజన్లుగా ఏర్పాటు చేయనున్నారు. అన్నమయ్య జిల్లా పేరు అలాగే ఉన్నప్పటికీ, జిల్లా కేంద్రాన్ని రాయచోటి నుంచి మదనపల్లెకు మారుస్తున్నట్లు ప్రకటించారు. పెనుగొండ పేరును 'వాసవీ పెనుగొండ'గా మార్చే ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించింది. గత ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయత, ప్రజాభిప్రాయం లేకుండా జిల్లాల విభజన చేపట్టిందని, దానివల్ల తలెత్తిన సమస్యలను ఇప్పుడు సరిదిద్దుతున్నామని మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ విమర్శించారు. పారదర్శకంగా వ్యవహరించి ఉంటే ఈ గందరగోళం ఉండేది కాదన్నారు. పోలవరం పరిసర ప్రాంతాలతో పాటు, రాయచోటిని అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని అనగాని తెలిపారు. మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల అమలులో వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనకు రూ.3 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని, కొప్పర్తి, ఓర్వకల్లు వంటి ప్రాంతాలకు పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని తెలిపారు. మచిలీపట్నం నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వరకు రహదారి నిర్మాణం జరుగుతోందని, కేంద్రం నుంచి రాష్ట్రానికి పూర్తి సహకారం అందుతోందని ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలా కాకుండా, పథకాలకు మహనీయుల పేర్లు పెడుతున్నామని, ఈ అంశంపై కూడా క్యాబినెట్‌లో చర్చ జరిగిందని ఆయన పేర్కొన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణతో పాటు, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కల్పించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం, విశాఖపట్నంలో ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయింపు వంటి ఇతర కీలక నిర్ణయాలకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలతో పరిపాలన ప్రజలకు మరింత చేరువ అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

## బంగ్లాదేశ్ ఎన్నికలు...
## రెండు చోట్ల నుంచి తారిఖ్ రెహ్మాన్ పోటీ

బంగ్లాదేశ్, డిసెంబర్ 28 :బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) యాక్టింగ్ ఛైర్మన్ తారిఖ్ రెహ్మాన్ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్నారు. ఢాకా17, బోగ్రా6 నియోజకవర్గాల నుంచి ఆయన బరిలో దిగుతారని పార్టీ వర్గాలు తెలిపాయి. బోగ్రా 16 నియోజకవర్గానికి గతంలో తారిఖ్ రెహ్మాన్ తల్లి, మాజీ ప్రధాని ఖలీదా జియా ప్రాతినిధ్యం వహించారు. ఒకప్పుడు ఈ స్థానం బీఎన్‌పీకి కంచుకోటగా ఉండేది. అయితే, 2023లో జరిగిన ఉప ఎన్నికల్లో అవామీ లీగ్ నాయకుడు ఆషన్ రిపు ఇక్కడ విజయం సాధించారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుండటంతో తారిఖ్ రెహ్మాన్ తరఫున బీఎన్‌పీ నాయకులు నామినేషన్లు దాఖలు చేశారు. సుమారు 17 ఏళ్ల తర్వాత తారిఖ్ రెహ్మాన్ బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చారు. ఎన్నికలకు కొన్ని వారాల ముందు ఓటరు జాబితాలో ఆయన పేరును చేర్చేందుకు ఎన్నికల సంఘం అంగీకరించింది. కాగా, మాజీ ప్రధాని షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్ కార్యకలాపాలపై నిషేధం కొనసాగుతున్నందున, ఆ పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడం కుదరదని తాత్కాలిక ప్రభుత్వం ఇదివరకే స్పష్టం చేసింది. షేక్ హసీనా గద్దె దిగినప్పటి నుంచి బంగ్లాదేశ్‌లో రాజకీయ అస్థిరత నెలకొన్న విషయం తెలిసిందే.

## పాక్ ఆర్మీపై బలూచిస్థాన్ సాయుధుల మెరుపుదాడులు..

పాకిస్థాన్, డిసెంబర్ 28: పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత కొన్ని వారాలుగా బలోచ్ వేర్పాటువాద సాయుధ గ్రూపులు జరిపిన వరుస దాడుల్లో కనీసం 15 మంది పాకిస్థానీ సైనికులు మరణించారు. ప్రావిన్స్‌లోని కెచ్, పంజ్‌గూర్, తుర్బాత్, సురబ్, నసీరాబాద్ వంటి పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ), బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్), బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్‌జీ) అనే మూడు సంస్థలు ఈ దాడులకు బాధ్యత వహిస్తున్నట్లు సోమవారం స్థానిక మీడియా వెల్లడించింది. డిసెంబర్ 23న కెచ్ జిల్లాలోని తేజాబన్ ప్రాంతంలో పాక్ ఆర్మీ పోస్టుపై తమ ఫైటర్లు దాడి చేసి ఇద్దరు సైనికులను హతమార్చినట్లు బీఎల్ఏ ప్రతినిధి జీయంద్ బలోచ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆటోమేటిక్ ఆయుధాలు, గ్రెనేడ్ లాంచర్లతో ఈ దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. డిసెంబర్ 25న చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ (సీపెక్) మార్గంలో సైనిక వాహనాన్ని లక్ష్యంగా చేసుకొని రిమోట్ కంట్రోల్ బాంబును పేల్చినట్లు తెలిపారు. ఈ ఘటనలో ఆరుగురు సైనికులు చనిపోగా, మరో నలుగురు గాయపడ్డారని వెల్లడించారు. అలాగే, తుర్బాత్‌లో పాక్ సైన్యం వినియోగిస్తున్న కమ్యూనికేషన్ టవర్‌ను ఆదివారం పేల్చివేసినట్లు 'ది బలూచిస్థాన్ పోస్ట్' పేర్కొంది. మరోవైపు, డిసెంబర్ 27న సురబ్ జిల్లాలోని ఆర్‌సీడీ హైవేపై వాహనాలను అడ్డగించి, సైందక్ మైనింగ్ ప్రాజెక్టుకు చెందిన ట్రక్కులకు భద్రతగా వస్తున్న కాన్వాయ్‌పై దాడి చేసినట్లు బలూచిస్థాన్ లిబరేషన్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) ప్రకటించింది. ఈ ఘటనలో ఐదుగురు సైనికులు మరణించినట్లు ఆ సంస్థ ప్రతినిధి మేజర్ గ్వాహ్రామ్ బలోచ్ తెలిపారు. నసీరాబాద్ జిల్లాలో శనివారం రాత్రి పాక్ సైనిక కాన్వాయ్‌తో తమ ఫైటర్లకు గంటపాటు ఎదురుకాల్పులు జరిగాయని, ఈ ఘటనలో ఇద్దరు సైనికులు మరణించారని బలోచ్ రిపబ్లికన్ గార్డ్స్ (బీఆర్‌జీ) ప్రకటించింది. బలూచిస్థాన్ స్వాతంత్ర్యం వచ్చేవరకు ఇలాంటి దాడులు కొనసాగిస్తామని ఆ సంస్థ స్పష్టం చేసింది.

## అసెంబ్లీలో కేసీఆర్ తో
## రేవంత్ రెడ్డి కరచాలనం..

హైదరాబాద్, డిసెంబర్ 28(భారతశక్తి ప్రతినిధి) :తెలంగాణ అసెంబ్లీ సమావేశాలలో ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. విపక్ష నేత హోదాలో అసెంబ్లీకి వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తో సీఎం రేవంత్ రెడ్డి కరచాలనం చేశారు. సభలో కేసీఆర్ వద్దకు వెళ్లి పలకరించారు. కేసీఆర్ ఆరోగ్యం గురించి సీఎం రేవంత్ రెడ్డి వాకబు చేశారు. మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీతక్క, ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ ఆయనను పలకరించి అభివాదం చేశారు.

*** రెండు నిమిషాల తర్వాత వెళ్లిపోయిన కేసీఆర్**

అసెంబ్లీ సమావేశాల తొలిరోజు దివంగత మాజీ ఎమ్మెల్యేలు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, కొండా లక్ష్మారెడ్డిలకు సంతాప తీర్మానాలను సభలో ప్రవేశపెట్టారు. అనంతరం సభ్యులు సంతాపం తెలిపారు. సంతాప తీర్మానాల అనంతరం కేసీఆర్ సభ నుంచి వెళ్లిపోయారు. మాజీ సీఎం కేసీఆర్ ఈ రోజు సభలో ఉన్నది కేవలం రెండు నిమిషాలు మాత్రమే.

## కేసీఆర్, నేను మాట్లాడుకున్నది మీకెలా చెబుతాను

హైదరాబాద్, డిసెంబర్ 28(భారతశక్తి ప్రతినిధి) :బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో తాను మాట్లాడిన విషయాలు మీకెలా చెబుతామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈరోజు అసెంబ్లీకి హాజరైన కేసీఆర్ కొద్ది నిమిషాల్లోనే వెళ్లిపోయారు. శాసనసభ ప్రారంభం కాగానే రేవంత్ రెడ్డి, కేసీఆర్ వద్దకు వెళ్లి కరచాలనం చేసి ఆయన క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సభలో రెండు నిమిషాలు మాత్రమే ఉన్నారు. అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్‌ను అసెంబ్లీలో మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రతి సభ్యుడిని తాము గౌరవిస్తామని, కేసీఆర్‌ను ఈరోజే కాకుండా, ఆసుపత్రిలో ఉన్నప్పుడు కూడా కలిశానని గుర్తు చేశారు. అసెంబ్లీ నుంచి ఆయన వెంటనే ఎందుకు వెళ్లారో కేసీఆర్‌నే అడగాలని అన్నారు. మీరిద్దరు ఏం మాట్లాడుకున్నారని విలేకరులు ప్రశ్నించగా, తామిద్దరం మాట్లాడుకున్నది మీకెలా చెబుతామని బదులిచ్చారు. ప్రస్తుతం బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో ఉందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. సభలో ప్రతిపక్షాల విమర్శలకు దీటుగా సమాధానం చెప్పేందుకు మంత్రులు సిద్ధంగా ఉండాలని సూచించారు. జిల్లాల వారీగా మంత్రులు ఎదురుదాడికి సిద్ధం కావాలని అన్నారు. సభలో పాయింట్ ఆఫ్ ఆర్డర్‌కు ప్రాధాన్యత ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రతిపక్షం అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇవ్వాలని సూచించారు. జనవరి 4 వరకు సభ జరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## గ్రేటర్ హైదరాబాద్ లో
## ఈకేవైసీ చేసుకోకుంటే రేషన్ కట్

హైదరాబాద్, డిసెంబర్ 28(భారతశక్తి ప్రతినిధి) :రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలని, దగ్గర్లోని రేషన్ షాపుకు వెళ్లి వేలిముద్రలు ఇవ్వాలని డీలర్లు సూచిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రతీ రేషన్ కార్డుదారుడు ఈ కేవైసీ చేయించుకోవాలని స్పష్టం చేశారు. రెండేళ్లుగా ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతున్నా రేషన్ కార్డుదారులలో స్పందన అంతంత మాత్రంగానే ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో పలుమార్లు గడువు పొడిగిస్తూ వస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ-కేవైసీ చేయించుకోని రేషన్ కార్డులకు సరుకులు ఆపేస్తారని ప్రచారం జరుగుతోంది. కొత్తగా రేషన్ కార్డు పొందిన వారితో పాటు పాత కార్డుల్లో కొత్తగా పేరు నమోదు చేయించుకున్న సభ్యులు తప్పకుండా ఈ- కేవైసీ చేయించుకోవాలని డీలర్లు చెబుతున్నారు. ఈ కేవైసీ చేసుకోని వారికి రేషన్ సరుకులు నిలిపివేస్తామని పౌరసరఫరాల శాఖ మౌఖిక ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. వచ్చే నెల కోటా పూర్తయ్యేలోపైనా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఈ- కేవైసీ ఎందుకంటే..**

రేషన్ కార్డు లబ్ధిదారుల్లో బినామీలు, బోగస్ కార్డులను గుర్తించేందుకే రేషన్ కార్డులో పేర్లు ఉన్న ప్రతీ సభ్యుడూ ఈకేవైసీ చేయించాలన్న నిబంధన అమలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. డూప్లికేట్ కార్డులు, చనిపోయిన యూనిట్ల ఏరివేత కార్యక్రమంలో భాగంగానే ఈ కేవైసీ చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్ అప్డేట్ లేకపోవడం వల్ల బయోమెట్రిక్ లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఈ-కేవైసీతో ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు.

## రైల్లో మంటలు.. సహాయక చర్యలపై సీఎం చంద్రబాబు స్పందన

అమరావతి, డిసెంబర్ 28(భారతశక్తి ప్రతినిధి) : టాటానగర్ ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే యలమంచిలి పోలీసులు, అగ్నిమాపక, రైల్వే, ఆర్‌పీఎఫ్ సిబ్బంది వేగంగా స్పందించి సమన్వయంతో పనిచేశారని ఆయన ప్రశంసించారు. వారి వృత్తి నైపుణ్యం వల్లే 150 మందికి పైగా ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీసుకురాగలిగారని అన్నారు. మంటలు వ్యాపించకుండా కోచ్‌లను వేరుచేయడం పెను ప్రమాదాన్ని నివారించిందని తెలిపారు. ఈ ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, మృతుడి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమవారం తెల్లవారుజామున అనకాపల్లి జిల్లా యలమంచిలి సమీపంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. టాటానగర్ నుంచి ఎర్నాకుళం వెళుతున్న ఎక్స్‌ప్రెస్ (18189) రైలులోని రెండు ఏసీ కోచ్‌లలో (బీ1, బీ2) ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో బీ1 కోచ్‌లో ప్రయాణిస్తున్న విజయవాడకు చెందిన చంద్రశేఖర్ సుందర్ (70) అనే వ్యక్తి మృతి చెందారు. లోకో పైలట్లు మంటలను గమనించి వెంటనే రైలును నిలిపివేయడంతో ప్రయాణికులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాదానికి గురైన రెండు కోచ్‌లను రైలు నుంచి వేరు చేసి, మిగతా రైలును సామర్లకోటకు పంపించారు. అక్కడి నుంచి ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఈ ప్రమాదం కారణంగా విశాఖపట్నంవిజయవాడ మార్గంలో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఘటనపై రైల్వే శాఖ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. ఫోరెన్సిక్ బృందాలు ఆధారాలు సేకరించి, ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను అన్వేషిస్తున్నాయి.

## వరల్డ్ ర్యాపిడ్ చెస్‌లో మెరిసిన తెలుగు తేజాలు..

ఫిడే వరల్డ్ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకాలు సాధించిన తెలుగు క్రీడాకారులు కోనేరు హంపి, అర్జున్ ఎరిగైసిలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనలు తెలిపారు. సోమవారం నాడు ఎక్స్ వేదికగా ఆయన ఇద్దరు క్రీడాకారులను ప్రత్యేకంగా ప్రశంసించారు. కోనేరు హంపిని ఉద్దేశించి చంద్రబాబు స్పందిస్తూ, "ఒక్క ఫలితంతో ఛాంపియన్లను అంచనా వేయలేం. అత్యున్నత స్థాయిలో పదేపదే పోటీపడే ధైర్యమే వారిని నిలబెడుతుంది. ప్రపంచ వేదికపై కాంస్యం సాధించడం మీ నైపుణ్యానికి నిదర్శనం. మీ ప్రయాణం, నిలకడ దేశంలోని లక్షలాది మందికి స్ఫూర్తినిస్తుంది" అని పేర్కొన్నారు. అదేవిధంగా అర్జున్ ఎరిగైసిని కూడా ఆయన కొనియాడారు. "పురుషుల్లో గ్రాండ్‌మాస్టర్ విశ్వనాథన్ ఆనంద్ తర్వాత ఈ ఘనత సాధించిన ఏకైక భారత క్రీడాకారుడిగా అర్జున్ నిలిచారు. తెలంగాణ బిడ్డ అయిన అర్జున్, భారత చెస్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి చేర్చారు" అని చంద్రబాబు అన్నారు. మరోవైపు, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి, హోం మంత్రి వి. అనిత, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ ఎ. రవి నాయుడు కూడా హంపికి శుభాకాంక్షలు తెలిపారు. హంపి ఇప్పటికే ఈ ఛాంపియన్‌షిప్‌లో ఐదు పతకాలు సాధించిందని, ఆమె మహిళా క్రీడాకారులందరికీ స్ఫూర్తిదాయకమని మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కూడా అర్జున్‌ను అభినందించారు. తెలంగాణ గడ్డకు గర్వకారణంగా నిలిచిన అర్జున్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా హంపిని కూడా అభినందించిన బండి సంజయ్, ఆమె దేశం గర్వపడేలా చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు.

## తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ రాష్ట్ర కో...
## కన్వీనర్ గా సీనియర్ పాత్రికేయులు కందుకూరి యాదగిరి నియామకం



సూర్యాపేట(భారత్ శక్తి జిల్లా ప్రతినిధి)డిసెంబర్ 28 : తెలంగాణ జర్నలిస్టు సంఘాల జేఏసీ రాష్ట్ర కో...కన్వీనర్ గా సూర్యాపేట జిల్లాకు చెందిన సీనియర్ పాత్రికేయులు కందుకూరి యాదగిరి నియామకం అయ్యారు. శనివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగిన సమావేశంలో యాదగిరి కి ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య, తెలంగాణ జర్నలిస్టు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆనించిన్ని వెంకటేశ్వర్లు,ఆల్ ఇండియా వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షులు కోటేశ్వరరావు లు మాట్లాడుతూ యాదగిరి గత నాలుగు సంవత్సరాలుగా జర్నలిస్టుల సంక్షేమం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి జర్నలిస్టుల అభివృద్ధి కోసం కృషి చేయడం అభినందనీయం అని తెలిపారు. ఆయన అసోసియేషన్ ద్వారా చేపట్టిన అన్ని కార్యక్రమాలను చూస్తున్నామని తెలిపారు. కష్టపడిన ప్రతి ఒక్కరికి తగిన సమయంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు.ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ జేఏసీ ఎప్పుడు ఎలాంటి పిలుపునిచ్చిన తాము అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటామని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పెద్దలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తు చేశారు.

## కోటాలో ఆధ్యాత్మిక పరిమళం

*** విద్యార్థులకు చిన్న జీయర్ స్వామి ఆశీర్వచనాలు**

*** విద్యార్థులకు భగవద్గీతపై ఓరియంటేషన్ తరగతుల్లో కర్తవ్య బోధన**



కరీంనగర్, డిసెంబర్ 28(భారతశక్తి ప్రతినిధి) : కోట విద్యాసంస్థల్లో ఆధ్యాత్మిక వాతావరణం పరిమిలించింది. పబ్లిక్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో శ్రీ శ్రీ శ్రీ త్రిదండి రామానుజ జీయర్ స్వామి, ప్రభుత్వం విప్ ఆది శ్రీనివాస్, వాల్మీకి విద్యాసంస్థలను ఛైర్మన్ యాదగిరి శేఖర్ రావులు సందర్శించి కోటా కుటుంబానికి తమ ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఓరియంటేషన్ తరగతులు నిర్వహించగా, భగవద్గీతలోని జీవన విలువలు, కర్తవ్యబోధ, క్రమశిక్షణ, నైతికత వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే ఆధ్యాత్మిక విలువలు అలవర్చుకుంటే విద్యార్థులు ఉన్నత వ్యక్తిత్వంతో ఎదుగుతారని జీయర్ స్వామి పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ, "భగవద్గీత కేవలం గ్రంథం మాత్రమే కాదు, అది జీవన మార్గదర్శిని. గీతలో చెప్పిన కర్మయోగం, భక్తియోగం, జ్ఞానయోగం విద్యార్థుల జీవితాలను సరైన దిశలో నడిపిస్తాయి. చదువుతో పాటు సంస్కారం ఎంతో అవసరం" అని తెలిపారు. ప్రభుత్వ విప్పు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, కోటా విద్యాసంస్థలు విద్యతో పాటు నైతిక విలువలకు పెద్దపీట వేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దుతాయని అన్నారు. టీఆర్ఎస్ఎంఏ అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు మాట్లాడుతూ, ఆధునిక విద్యకు ఆధ్యాత్మికతను జోడిస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. కోటా విద్యాసంస్థల కృషిని ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కోట విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ డి అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాలలో నిష్ణాతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కోట విద్యాసంస్థలు ముందుకు వెళ్తున్నాయని అన్నారు. కోటా విద్యాసంస్థల నిర్వాహకులు అతిథులకు ఘన స్వాగతం పలికారు. ప్రిన్సిపాల్ లు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా కోటా కుటుంబానికి జీయర్ స్వామి ప్రత్యేక ఆశీర్వచనాలు అందించడంతో కార్యక్రమం ఆధ్యాత్మిక శోభతో ముగిసింది.

# నాగోల్ లో రాంరాజ్ కాటన్ షోరూం ప్రారంభం



ఎల్బీనగర్, డిసెంబర్ 29 (భారత శక్తి): భారతదేశ సంస్కృతి, సాంప్రదాయ వస్త్రాలకు నిలయం రాంరాజ్ కాటన్ అని ప్రముఖ సినీనటుడు సుమన్ తల్వార్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో బండ్లగూడ వెళ్లే ప్రధాన రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన రాంరాజ్ కాటన్ షోరూంను సోమవారం ముఖ్యఅతిథిగా సినీనటుడు సుమన్, విశిష్ట అతిథిగా రాంరాజ్ కాటన్ వ్యవస్థాపక చైర్మన్ కేఆర్ నాగరాజన్ లు విచ్చేసి నిర్వాహకులు పీవీ రమణారావు, పీవీ శ్రీనివాసరావు, లక్ష్మిలచే కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ, అతి తక్కువ ఖర్చుతో పదిమందిలో గొప్పగా కనబడాలని అనుకునే వారికి రాంరాజ్ కాటన్ షోరూం నాణ్యత విషయంలో ఏ మాత్రం తగ్గకుండా వస్త్రాలు అందిస్తోందన్నారు. తన సినిమా షూటింగ్లలోనూ ఎక్కువ శాతం రాంరాజ్ కాటన్ వస్త్రాలనే వాడుతుంటానన్నారు. రాంరాజ్ వ్యవస్థాపకుడు కేఆర్ నాగరాజన్ మాట్లాడుతూ, వినియోగదారుల మన్ననలతోనే రాంరాజ్ కాటన్ స్థాపించిన నాటి నుంచి అంచలంచెలుగా ఎదుగుతూ వస్తోందని, తెలంగాణ రాష్ట్రంలో 51వ షోరూంని నాగోల్ ప్రాంతంలో ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు పురుషులు, మహిళలకు అందరి అభిరుచులకు అనుగుణంగా రకరకాల డిజైన్లతో అన్ని వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. నాగోల్ షోరూం నిర్వాహకుడు పీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, 2023లో తన స్నేహితుడు రాంరాజ్ కాటన్ షోరూంను ఏర్పాటు చేశాడని, నాటి నుంచి తాను సైతం ఈ షోరూంను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుని ప్రయత్నిస్తూ వస్తూ నేడు ఆ కలను సాకారం చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రాంరాజ్ వస్త్రాలను మొదటగా కొనుగోలు చేసిన వినియోగదారుడు రమేష్ బెహరా, మురళీ బెహరా, కమల్ బెహరాలకు వారు వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చెరుకు ప్రశాంత్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు శరత్ రెడ్డి, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.



## బంగారాన్ని బాధితురాలికి అప్పగించిన రాచకొండ పోలీసులు

ఎల్బీనగర్, డిసెంబర్ 29 (భారత శక్తి): ఆటోలో పోగొట్టుకున్న బ్యాగును గంట వ్యవధిలోనే చేధించి పోగొట్టుకున్న బ్యాగును బాధితులకు ఎల్బీనగర్ పోలీసులు అప్పగించారు. ఖమ్మం పట్టణానికి చెందిన తిప్పన వెంకట్ రెడ్డి భార్య తిప్పన జ్యోతి ఈ నెల 29 సోమవారం ఉదయం ఖమ్మంలో ఆర్టీసీ బస్ ఎక్కి, ఎల్బీనగర్ క్రాస్ రోడ్ లోని నర్సింగ్ షాపింగ్ మాల్ వద్ద మధ్యాహ్నం 12 గంటలకు దిగింది. బస్ దిగిన అనంతరం ఒక ప్యాసింజర్ ఆటోలో ఎక్కి సెంట్రల్ బ్యాంక్ కాలనీలో దిగింది.ఆటో దిగిన తర్వాత తన బ్యాగు అందులో మరిచిపోయినట్లు గ్రహించింది. వెంటనే ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఆటోలో మరిచిపోయిన బ్యాగులో ఒక తులం నల్లపూసల గొలుసు, రెండు గ్రాముల బంగారు గాజులు, విలువైన పట్టు చీరలు కలిగిన బ్యాగును మర్చిపోయినట్లు తెలిపింది. వెంటనే డిటెక్టివ్ ఇన్స్ పెక్టర్ నాగార్జునరెడ్డి, తన టీంతో కలిసి సీసీ కెమెరాల ద్వారా ఆటోను గుర్తించి గంట వ్యవధిలోనే చేధించి పోగొట్టుకున్న బ్యాగును అందులోని బంగారు వస్తువులను భాదితురాలికి అందజేసినట్లు డిఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

## అర్హులైన వారందరికీ అక్రిడిటేషన్ ఇవ్వాలి

- **గ్రేటర్ పరిధిలోని మండలాల్లో అక్రిడిటేషన్ల సంఖ్య పెంచాలి**
- **ఐ అండ్ పి ఆర్ కమిషనర్ కు విజ్ఞప్తి చేసిన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) బృందం**

హైదరాబాద్, డిసెంబర్ 29 (భారత శక్తి): గ్రేటర్ హైదరాబాద్ పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు వచ్చే విధంగా జీవోలో సవరింపులు చేపట్టాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) బృందం సమాచార శాఖ కమిషనర్ కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం సచివాలయం లోని ఐ అండ్ పిఆర్ కార్యాలయంలో ప్రత్యేక కమిషనర్ ప్రియాంకను కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా టీయుడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కే శ్రీకాంత్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్, హెచ్ యుజె అధ్యక్షులు శిగా శంకర్, మేడ్చల్ అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎండీ సలీమ్ పాషా, మేడ్చల్ కార్యదర్శి వెంకట్ రాం రెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణలు సమస్యను ఆమెకు వివరించారు. గ్రేటర్ పరిధిలోని అర్బన్ మండలాలలో ప్రధాన పత్రికలలో నలుగురు నుంచి ఐదుగురు జర్నలిస్టులు విధులు నిర్వహిస్తున్నారని ఆమెకు తెలిపారు. నూతన జీవో 252 ద్వారా ఒక పత్రికకు మండలానికి ఒకే అక్రిడిటేషన్ పొందే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన ముగ్గురు నలుగురికి అక్రిడిటేషన్ అవకాశం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. రూరల్ మండలాలతో కాకుండా అర్బన్ మండలాలను ప్రత్యేకంగా చూడాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల ఆవేదనలు దృష్టిలో ఉంచుకొని జీవోలో సవరణలు చేసి న్యాయం చేయాలని కోరారు.



**సానుకూలంగా స్పందించిన కమిషనర్**

గ్రేటర్ పరిధిలోని మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై పౌర సంబంధాలు అండ్ సమాచార శాఖ కమిషనర్ ప్రియాంక సానుకూలంగా స్పందించారు. అర్బన్ మండలాలలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వడం న్యాయ బద్ధమైనదని తెలిపారు. త్వరలోనే మంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని హామీని ఇచ్చారు.



## కాలనీలో ఓటమిని తట్టుకోలేక నాపై అసత్య ఆరోపణలు : పెండ్యాల నగేష్

ఎల్బీనగర్, డిసెంబర్ 29 (భారత శక్తి): ఆర్కేపురం డివిజన్ చిత్రా లేఔట్ కాలనీ మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి ఆరోపణలు ఓటమిని జీరించుకోలేక, నా ఎదుగుదలను తట్టుకోలేక చిన్న సంఘటనను అడ్డు పెట్టుకొని నన్ను అభాసుపాలు చెయ్యాలనే కక్షతో విషం వెళ్ళగక్కిన ఆక్రోషం తప్ప అవి నిజాలు కావని చిత్రా లే అవుట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పెండ్యాల నగేష్ తెలిపారు. సోమవారం చిత్రా లేఅవుట్ కాలనీలో కాలనీవాసుల సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ, కాలనీవాసిగా మాజీ అధ్యక్షునిగా సమస్య ఏర్పడితే నచ్చచెప్పే ప్రయత్నం చెయ్యాలి గానీ మీరే దానికి ఆజ్యం పోసి రాజకీయ రంగు పులమటం మంచి పద్ధతి కాదని అన్నారు.మీరు 18 సంవత్సరాలుగా కాలనీలో సాగిస్తున్న ఆరాచకాలను తట్టుకోలేక కాలనీ ప్రజలు మిమ్మల్ని మూడు సార్లు చిత్తు చిత్తుగా ఓడగొట్టారని అన్నారు. 24వ తేదీన జరిగిన సంఘటన మీ ప్రోద్బలంతో నా మీద దాడికి ప్రయత్నం జరిగిందని తెలిపారు. దీనిపై ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని, ఈ విషయంపై ఎంక్వయిరీ జరుగుతుందని త్వరలోనే నిజ నిజాలు తెలుస్తాయని తెలిపారు. ఇప్పటికైనా ఇలాంటి చిల్లర ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు.మహిళలను, పిల్లలను,వృద్ధులను అత్యంత గౌరవించే వ్యక్తిగా పేరున్న వ్యక్తిగా నగేష్ కి పేరుందని కాలనీ మహిళలు తెలిపారు.కాలనీ అధ్యక్షులుపై బురద జల్లే ప్రయత్నం వద్దని కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మీర్ పేట్, డిసెంబర్ 29 (భారత శక్తి): మహేశ్వరం నియోజకవర్గంలోని మహేశ్వరం మండలం సిరిగిరిపురం గ్రామంలో మహనీయులు డా. బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని గ్రామ సర్పంచ్ దయ్యాల కృష్ణవేణి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ, నూతనంగా ఎన్నికై గెలుపొందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. పరిపాలన ప్రారంభానికి ముందు మహనీయులైన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం గొప్ప విషయమని, ఆయన సిద్ధాంతాలను ఆచరణలో పెట్టినప్పుడే దేశానికి, సమాజానికి మంచి భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు.ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ పాలన తీరుపై విమర్శలు గుప్పించిన ఎమ్మెల్యే, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, వాటిపై ప్రశ్నిస్తే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై విమర్శలు చేయడం సరైన విధానం కాదని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని, రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో కూడా భారీ నుంచి అతి భారీ మెజార్టీతో విజయం సాధించి ప్రభుత్వ అహంభావాన్ని ప్రజలే దెబ్బతీస్తారని సబితా ఇంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు.సిరిగిరిపురం గ్రామస్తులకు ఎలాంటి సమస్య వచ్చినా తాను ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా కల్పించారు. అభివృద్ధి విషయంలో నిధులు ఎక్కడి నుంచైనా తెచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేయడం తన బాధ్యత అని హామీ ఇచ్చారు. ఎన్నికలు ఎప్పుడైనా కేసీఆర్ అధ్యక్షతన, తన నాయకత్వాన్ని బలపరచి పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా గ్రామ ప్రజలను విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిరిగిరిపురం సర్పంచ్ దయ్యాల కృష్ణవేణి శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాగరాణి మహేష్, వార్డు సభ్యులు, మహేశ్వరం మండల అధ్యక్షులు రాజు నాయక్, చంద్రయ్య, అంబయ్య యాదవ్, మహేశ్వరం సర్పంచ్ నవీన్, ఆనందం, సమీర్, ప్రభాకర్ మరియు భారీగా హాజరైన సిరిగిరి పురం గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.



## భైంసాలోని మెహదూద్ అల్ అబ్రార్ మదర్సాలో నెలవారీ ఇస్లాహీ సభ

- **కొత్త 13 హాఫిజ్‌లకు దస్తార్ బంధీ కార్యక్రమం**

కుమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 28 (భారత శక్తి) భైంసాలోని మెహదూద్ అల్ అబ్రార్ మదర్స ఆధ్వర్యంలో ఆదివారం ఖాన్ ఆటో నగర్‌లో ఉన్న మదర్స ఆవరణలో ఘనంగా నెలవారీ ఇస్లాహీ సభతో పాటు కొత్త హాఫిజ్లకు దస్తార్ బంధీ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ పవిత్ర సభ ఉదయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ప్రసిద్ధ పీర్ తరీకత్, సున్నత్ అనుసరించి హజ్రత్ మౌలానా పీర్ జుల్ఫికార అహ్మద్ సాబ్ (రహ్మతుల్లాహి అలైహి) గారి జీవితం, ధార్మికసామాజిక సేవలపై విస్తృతంగా ప్రసంగాలు జరిగాయి. ఈ సభకు ఆధ్యాత్మిక పరిరక్షకులు. ఎం. సలాహుద్దీన్ సైఫీ అధ్యక్షత వహించారు.

ఈ శుభ సందర్భంలో 2018 నుంచి 2025 మధ్యకాలంలో ఖురాన్ హిఫ్జ్ మరియు దర్సె నిజామీ పూర్తి చేసిన మొత్తం 89 మంది విద్యార్థులకు హజ్రత్ వాలా గారి పవిత్ర హస్తాల ద్వారా దస్తార్ బంధీ చేయబడింది. దీంతో సభావేదిక ఆధ్యాత్మికతతో పాటు ఆనందోత్సాహాలతో నిండిపోయింది.

- **ఈ ఏడాది ఉత్తీర్ణులైన 13 మంది అదృష్టశాలి హాఫిజ్ లు:**

>> హాఫిజ్ మహ్మద్ ఉమర్ బిన్ షేక్ ఖలీల్ (భైంసా),
>> హాఫిజ్ సయ్యద్ అబుల్ ఖాసిం నుమాన్ బిన్ మౌలానా సయ్యద్ రిజ్వాన్ (ఉట్నూర్),
>> హాఫిజ్ షేక్ ఆదిల్ బిన్ షేక్ అబ్దుల్ అజీజ్ (ధర్మాబాద్),
>> హాఫిజ్ మహ్మద్ సలాహుద్దీన్ బిన్ మౌలానా మహ్మద్ రియాజుద్దీన్ ఖాస్మి (భైంసా),
>> హాఫిజ్ మహ్మద్ సాద్ బిన్ ఖుజైమా బిన్ మౌలానా మహ్మద్ సల్మాన్ ఖాస్మి (భైంసా),
>> హాఫిజ్ షేక్ ముఆజ్ బిన్ షేక్ నూర్ హబీబ్ (నిజామాబాద్),
>> హాఫిజ్ మహ్మద్ ఫాజుద్దీన్ బిన్ మహ్మద్ ఇర్షాద్ ఉద్దీన్ సాబ్ (నిర్మల్),
>> హాఫిజ్ అతాఉర్రహ్మాన్ ఖాన్ బిన్ మహ్మద్ ఫిరోజ్ ఖాన్ (ధర్మాబాద్),
>> హాఫిజ్ మహ్మద్ హుజైఫ్ బిన్ మహ్మద్ అబ్దుల్ వాసీఅ్ (ముధోల్),
>> హాఫిజ్ మహ్మద్ ఉస్మాన్ బిన్ అబ్దుర్ రహ్మాన్ హబీబ్ (నిర్మల్),
>> హాఫిజ్ మహ్మద్ జైద్ ఖాన్ బిన్ మహ్మద్ ఆదమ్ ఖాన్ (కుబీర్),
>> హాఫిజ్ షేక్ అనస్ అహ్మద్ బిన్ షేక్ అలీఖ్ అహ్మద్ (నిర్మల్),
>> హాఫిజ్ మహ్మద్ షుఐబ్ అఖ్తర్ బిన్ షేక్ అహ్మద్ (జైనూర్).



కార్యక్రమం ముగింపులో ప్రత్యేక దువాతో సభను ముగించారు. ఈ సందర్భంగా ఉమ్మత్ఇముస్లిం, దేశప్రజల అభివృద్ధి, శాంతి భద్రతల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ఉలేమా కరామ్, ఇమాములు, పట్టణ ప్రముఖులు, సంస్థ సంరక్షకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సామాజిక, మతపరమైన కార్యకర్తల ఆధ్వర్యంలో కొత్త హాఫిజ్లకు బహుమతులు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

## నిర్మల్ నూతన ఏఎస్పీ గా బాధ్యతలు స్వీకరించిన పత్తిపాక సాయికిరణ్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, డిసెంబర్ 28 (భారత శక్తి) నిర్మల్ జిల్లా నూతన ఏఎస్పీ గా పత్తిపాక సాయికిరణ్ గురువారం 25.12.2025 రోజున అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా SDPO కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశం నిర్వహించిన నూతన ఏఎస్పీ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు.




Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.